ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు

బుధవారం 1 అక్టోబరు 2025





పెసర్లంకను చుట్టుముట్టిన వరద నీరు

పింఛను పండుగ!

- పంపిణీకి సర్వం సిద్ధం
- దివ్యాంగుల పింఛన్లలో తొలగింపు లేదు



గుంటూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగ ముందే.. పింఛన్ల పండగొచ్చింది. జిల్లాలోని పింఛను దారులందరికీ ఒకటో తేదీనే పింఛన్లు అందజేయడానికి గ్రామీణాభివృద్ధి శాఖ కసరత్తు చేస్తోంది. దీనికి సంబంధించి మూ డు జిల్లాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. పింఛను నగదు మొత్తాన్ని ప్రభుత్వం సచి వాలయ సిబ్బంది ఖాతాలో జమ చేసింది. మంగళవారం సాయంత్రానికే సచివాలయ సిబ్బంది నగదు డ్రా చేసి.. పంపిణీ సిద్ధం గా ఉంచుకున్నారు. బుధవారం ఉదయం ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు అందించనున్నారు.

● తొలి రోజే 95 శాతం

గుంటూరు జిల్లాలో 2,54,290, పల్నాడు జిల్లాలో 2,73,150, బాపట్ల జిల్లాలో 2,27411 మంది పింఛనుదారులు ఉన్నారు. వీరందరికీ వలంటీర్లు లేకపోయినప్పటికీ తొలిరోజే పింఛన్లు అందజేస్తున్నారు. మూ డు జిల్లాల్లో సచివాలయ సిబ్బంది తొలి రోజునే 95 శాతం పింఛన్లు అందజేస్తున్నారు. ఈ నేపథ్యంలో పింఛనుదారులు అందరికీ దసరా ముందురోజే పింఛను నగదు అందనుంది. ప్రతి నెలా ఒకటవ తేదీ పండగ, ఆదివారం, సెలవు దినం ఉంటే ఒక రోజు ముందుగానే పింఛన్ల నగదును ప్రభుత్వం అందజేస్తోంది. గురువారం దసరా పండుగ కావడంతో ముందు రోజు లబ్ధిదారులకు పింఛను నగదు అందనుంది.

● దివ్యాంగులకు యథాతథం

బోగస్ దివ్యాంగ పింఛన్లను ప్రభుత్వం పరిశీలిస్తోంది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో 10,279 మందిని అనర్హులుగా గుర్తించింది. వీరిలో కొంతమంది అర్హులు కూడా అనర్హత బారిన పడడంతో గత నెల ఆందోళన కొనసాగింది. ఈ నేపథ్యంలో వారికి కూడా కిందటి నెల యథాతదంగా పింఛన్లు అందజేశారు. ఈ నెల కూడా వారిపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టలేదు. వారికి కూడా పింఛన్లు అందజేయనున్నారు.

● అందరికీ పింఛన్లు: డీఆర్డీప పీడీ విజయలక్ష్మి

ప్రతి లబ్ధిదారునికి ఒకటో తేదీనే పింఛన్ అందించేందుకు చర్యలు తీసుకున్నాం. ఆ రోజు ఎవరైనా అందుకోలేని పక్షంలో ఆందోళన పడాల్సిన పనిలేదు. వారికి మూడో తేదీ నుంచి యథావిధిగా పింఛన్లు అందజేస్తాం. దివ్యాంగుల పింఛన్లలో ఎలాంటి తొలగింపు లేదు. వారికి కూడా ఈనెల పింఛన్లు అందజేస్తున్నాం.

వీడని ముంపు



కొల్లూరు: వరద నీటిలో ఉన్న ఇటుక బట్టీలు



వరద నీటిలో మునిగిపోయిన అరటి తోట



అరవింద వారధి వద్ద వరద ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు



కొల్లిపర వద్ద వరద నీటిలోనే పసుపు



సుగ్గునలంక చప్టాపై వరద ప్రవాహం

- జల దిగ్బంధంలోనే లంక గ్రామాలు
- ఒక అడుగు వెనక్కు.. రెండడుగులు ముందుకు
- వరద తగ్గినట్టే తగ్గి ఇంతలోనే పెరుగుతూ
- చాలా లంకలకు రాకపోకలు లేవ్
- అత్యవసర సేవల కోసం పడవలు ఏర్పాటు
- వాణిజ్య పంటలు, రొయ్యల చెరువులకు తీరని నష్టం

మూడు రోజులుగా చుట్టుముట్టిన వరద ఒక అడుగు వెనక్కు వెళితే, ఇంతలోనే రెండడుగులు ముందుకు చొచ్చుకొస్తోంది. తగ్గిందని ఊపిరి పీల్చుకునేలోపే మళ్లీ వరద పెరిగిపోతోంది. లంక గ్రామాలపై ఉగ్రరూపం చూపిన కృష్ణమ్మ శాంతించటంలేదు. దీంతో కృష్ణా తీరంలోని గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు. రోడ్లపైకి కూడా వరద నీరు చేరటంతో రాకపోకలకు ఇంకా ఆటంకాలు తప్పటంలేదు. దీంతో ఏ గ్రామంలోనివారు ఆ గ్రామంలోనే చిక్కుకుపోయారు. అధికారులు సురక్షిత ప్రాంతాలకు రావాలని పలుమార్లు హెచ్చరికలు చేసినా పశువులను వదిలి బయటకు రావటానికి ఎవరూ ఇష్టపడటం లేదు. అయితే కొన్ని గ్రామాల్లో పరిస్థితి విషమించే వాతావరణం ఉండటంతో ఆ గ్రామాలకు విద్యుత్తు సరఫరాను నిలిపివేసి, 500 మందివరకు రెండు గ్రామాలనుంచి సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

- వివరాలు 4లో



కొల్లిపర : బొమ్మువానిపాలెం వద్ద నీట మునిగిన కంది పంట



పెనుమూడి వద్ద వరదను పరిశీలిస్తున్న మంత్రి అనగాని



పునరావాస కేంద్రంలో వరద బాధితులతో మాట్లాడుతున్న మంత్రి అనగాని సత్యప్రసాద్



వరద నీటిలోనే పెనుమూడి పల్లెపాలెం

కొత్త ఉపాధ్యాయులకు..ఐదు చోట్ల శిక్షణ

- శిక్షణ అంశాలను విడుదల చేసిన విద్యాశాఖ

గుంటూరు (విద్య) సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులకు గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఐదు శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అభ్యర్థులకు ఈ నెల 3 నుంచి 10వ తేదీ వరకు శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. గుంటూరు జోన్-3 పరిధిలో 1,600 అభ్యర్థులు ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. వారికి నియామక పత్రాలను ప్రభుత్వం జారీ చేసింది. పాఠశాలలో వారికి పోస్టింగ్ ఇచ్చేందుకు అవసరమైన ప్రాథమిక శిక్షణను విద్యాశాఖ అందించనుంది.

తరగతులు ఇలా..

డీఎస్సీ కన్వీనర్ జారీ చేసిన ఉత్తర్వులు ప్రకారం శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. ఇందుకోసం ఇప్పటికే అధ్యాపకులన సిద్ధం చేశారు. తొలుత ప్రాథమిక శిక్షణ అందిస్తారు. అనంతరం విద్యా బోధనలో ప్రావీణ్యం, విద్యాశాఖ విధివిధానాలు, చట్టాలు, పిల్లలతో బాధ్యతాయుత ప్రవర్తన, కేంద్ర, రాష్ట్ర విద్యా విధానాలు, విద్యాభివృద్ధి పథకాలు, పాఠ్య ప్రణాళిక, మూల్యాంకనం, సృజనాత్మకత ఆకలింపు, విద్యా బోధనలో సాంకేతికత తదితర అంశాల్లో నూతన ఉపాధ్యాయుల శిక్షణ ఇస్తారు.

ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఉద్యోగానికి ఎంపికైన ప్రతి ఉపాధ్యాయుడు శిక్షణకు హాజరు కావాల్సిందేనని, ఎవరికి ఇందులో మినహాయింపు లేదని డీఈఓ సీవీ రేణుక స్పష్టం చేశారు.



మెగా డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులను అభినందిస్తున్న కలెక్టర్ అన్సారియా

శిక్షణ కేంద్రాలు ఇవే..

నరసరావుపేటలోని వాగ్దేవి జూనియర్ కాలేజీ, బూరనపేట ప్రగతి భవన్‌లో స్కూల్ అసిస్టెంట్ తెలుగు, హిందీ, ఇంగ్లిష్, ఉర్దూ అభ్యర్థులకు శిక్షణ ఇవ్వనున్నారు.

వినుకొండ సమీపంలోని వివేకానంద బీఈడీ కళాశాలలో స్కూల్ అసిస్టెంట్ బయోలాజికల్ సైన్స్ (ఉర్దూ, ఇంగ్లిష్), ఫిజిక్స్, గణితం అభ్యర్థులకు శిక్షణ ఇస్తారు.

నరసరావుపేటలోని వాగ్దేవి జూనియర్ కాలేజ్ వైశ్య భవన్‌లో(రావిపాడు రోడ్డు) సెకండరీ గ్రేడ్ టీచర్స్ (తెలుగు, ఉర్దూ మీడియం) అభ్యర్థులకు శిక్షణ తరగతులుంటాయి.

ఫిజికల్ ఎడ్యుకేషన్, స్కూల్ అసిస్టెంట్ సోషల్ స్టడీస్ అభ్యర్థులకు గుంటూరు నగరంలోని సెయింట్ జోసెఫ్ బీఈడీ కళాశాల (సాంబశివపేట, ప్రభుత్వ డిగ్రీ కళాశాల రోడ్డు)లో శిక్షణ ఇస్తారు.

సెకండరీ గ్రేడ్ టీచర్లకు నరసరావుపేటలోని వాగ్దేవి జూనియర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదురు (పాత ఎన్‌బీటీ ఎన్.టి. ఆర్ కాలేజ్) శిక్షణ అందిస్తారు.

దివ్యరూపిణీ.. పాపహారిణీ..

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. దుర్గాష్టమి రోజైన మంగళవారం పలు ఆలయాల్లో అమ్మవార్లు దుర్గాదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. భక్తుల అమ్మవారి దివ్య స్వరూపాన్ని దర్శించుకుని కటాక్షం పొందారు. ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. - గుంటూరు



గుంటూరు వికాసనగర్‌లో షిర్డి సాయిమందిరంలో దుర్గాదేవిగా అమ్మవారు

అన్నపూర్ణ కాంప్లెక్స్ వ్యాపారులకు షాక్..!

ఈ నెల 10లోపు ఖాళీ చేయాలని హైకోర్టు ఆదేశం

గుంటూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ కొల్లి శారద హోల్‌సేల్ కూరగాయల మార్కెట్‌లో దుకాణాల బహిరంగ వేలాన్ని బహిష్కరించి.. బుడంపాడు సమీపంలో హైవే పక్కన ఉన్న అన్నపూర్ణ కాంప్లెక్స్‌లో మార్కెట్ నిర్వహిస్తున్న వ్యాపారులకు హైకోర్టు షాక్ ఇచ్చింది. ఈ కాంప్లెక్స్‌ని ఈ నెల 10వ తేదీ లోపు ఖాళీ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణను 15వ తేదీకి వాయిదా వేసింది. హైకోర్టు ఆదేశాలతో కూరగాయల వ్యాపారులు.. హోల్‌సేల్ మార్కెట్ ఏక్కడ ఏర్పాటు చేసుకోవాలో తెలియక మథన పడుతున్నారు. నగరంలో ఆర్టీసీ బస్టాండ్‌కు సమీపంలో ఉన్న డాక్టర్ కొల్లి శారద హోల్‌సేల్ కూరగాయల మార్కెట్‌లో వ్యాపారులు 1999 నుంచి షాపులు లీజుకు తీసుకొని ఉంటున్నారు. వాళ్ల నిబంధనలను అతిక్రమించడంతో నగరపాలక సంస్థ ఇటీవలే బహిరంగ వేలం నిర్వహించింది. ఈ వేలం ప్రక్రియని నిలుపుదల చేసేందుకు వ్యాపారులు హైకోర్టుకి వెళ్లారు. అయితే వేలం వేయాలని కోర్టు ఆదేశించడంతో.. నగరపాలక సంస్థ అధికారులు బహిరంగ వేలం నిర్వహించారు. గతం కంటే భారీగా అద్దె చెల్లించి దుకాణాలను లీజుకు తీసుకున్నారు. కాగా, పాత లీజుదారులు ఎవరూ ఈ వేలంలో పాల్గొనలేదు. వీళ్లకి వివిధ ప్రాంతాల నుంచి కూరగాయలు సరఫరా చేసే రైతులు, కమీషన్ వ్యాపారులతో ముందుగానే మాట్లాడుకొని కొల్లి శారద మార్కెట్‌కు ఒక్క కూరగాయల బస్తా కూడా రాకుండా చేశారు. ప్రత్యామ్నాయంగా బుడంపాడు వద్ద ఉన్న అన్నపూర్ణ సొసైటీలోని దుకాణాలను లీజుకు తీసుకొని అక్కడ వ్యాపారం ప్రారంభించారు. అయితే ఈ సొసైటీలో అనేక అతిక్రమణలున్నాయి. పైగా మార్కెటింగ్, నగరపాలక సంస్థ నుంచి ఎలాంటి అనుమతి తీసుకోకుండానే కూరగాయల హోల్‌సేల్ మార్కెట్‌ని ప్రారంభించారు. దీనిపై హైకోర్టులో కేసు దాఖలైంది. ఇరుపక్షాల వాదనలు విన్న హైకోర్టు తక్షణమే అన్నపూర్ణ కాంప్లెక్స్‌ను వ్యాపారులను ఖాళీ చేయాలని ఆదేశాలు జారీ చేసింది.

గుంటూరు కలెక్టర్ పేరుతో.. ఫేక్ ఫేస్‌బుక్ అకౌంట్

- మోసపోవద్దని కలెక్టర్ అన్సారియా విజ్ఞప్తి

గుంటూరు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): 'డీసీ గుంటూరు(డిస్ట్రిక్ట్ కలెక్టర్ గుంటూరు)' పేరుతో సైబర్ నేరగాళ్లు నకిలీ ఫేసు బుక్ అకౌంట్‌ని రూపొందించారు. ప్రొఫైల్‌ని లాక్ చేశారు. మంగళవారం ఈ ఫేక్ అకౌంట్‌ని కలెక్టర్ తమీమ్ అన్సారియా, అధికార వర్గాలు గుర్తించాయి. ప్రొఫైల్ పిక్ కలెక్టర్ అన్సారియా ఫొటో పెట్టడం, రాష్ట్ర ప్రభుత్వం చిహ్నం కూడా జోడించడంతో.. కొందరు ఈ అకౌంట్‌కి ఫ్రెండ్స్‌గా యాడ్ అయ్యారు. ఈ నకిలీ ఫేస్‌బుక్ అకౌంట్‌ని చూసి మోసపోవద్దని ఫాలో వర్స్‌కు అధికారులు, కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఫేక్ అకౌంట్‌ను నుంచి ఫేస్‌బుక్ నుంచి తొలగించేందుకు ఫిర్యాదు చేశారు. డిస్ట్రిక్ కలెక్టర్ గుంటూరు పేరుతో అధికారిక ఫేసుబుక్ అకౌంట్ ఉంది. దీనికి 12 వేల మంది ఫాలోవర్స్ ఉన్నారు. ఇందులో కలెక్టర్ పర్యటనలు, ప్రజలకు సంబంధించిన ముఖ్యమైన సమాచారాన్ని పోస్టింగ్ చేస్తుంటారు. ఏవైనా సమావేశాలు జరిగినా క్లుప్తంగా పొందుపరుస్తారు. జిల్లా ప్రజలు తమ సమస్యలు నివేదించినా వెంటనే స్పందించి చర్యలు చేపడతారు. అయితే ఫేక్ ఖాతా ద్వారా ఫాలోవర్స్‌కి పర్సనల్‌గా మెసేజ్‌లు పంపి, అత్యవసరంగా నగదు కావాలని చెప్పి అభ్యర్థిస్తారు. దీని వల్ల అమాయకులు మోసపోయే అవకాశం లేకపోలేదు.



ఎడమ వైపున ఉన్నది కలెక్టర్ ఒరిజినల్ ఫేస్‌బుక్ అకౌంట్, కుడివైపున ఉన్నది నకిలీ ఫేస్‌బుక్ అకౌంట్

వ్యవసాయ వర్సిటీకి మాయని మచ్చ!



- అక్రమాలను నిగ్గుతేల్చేందుకు చర్యలు
- విచారణాధికారిగా సీనియర్ ఐఏఎస్ అధికారి ఢిల్లీరావు
- త్వరగా నివేదిక ఇవ్వాలని ఉత్తర్వులు
- ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీ చరిత్రలో తొలిసారి

గుంటూరు సిటీ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో చోటు చేసుకున్న అక్రమాలను నిగ్గు తేల్చేందుకు ప్రభుత్వం ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. సీనియర్ ఐఏఎస్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీ రావును విచారణ అధికారిగా నియమించింది. ఈ మేరకు వ్యవసాయశాఖ ఎక్స్ అఫీషియో కార్యదర్శి బుడితి రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం విడుదలైన ఈ ఉత్తర్వుల్లో విచారణ త్వరగా ముగించి నివేదిక అందజేయాలని వ్యవసాయ శాఖ డైరెక్టర్‌ను ఆదేశించారు. యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్, కర్నూలు జిల్లాకు చెందిన అడ్వకేట్.. ఇన్‌చార్జి వీసీ శారదా జయలక్ష్మిపై చేసిన ఫిర్యాదు ఆధారంగా ఈ విచారణ జరగనుంది. ఇన్‌చార్జి వీసీపై వచ్చిన అవినీతి ఆరోపణలు, బెదిరింపుల అంశాలపై విచారణ జరిపాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మసక బారిన ప్రతిష్ట

వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన నియామకాలు, రాజకీయాల వల్ల ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం ప్రతిష్ట క్రమేపీ మసక బారుతోంది. విశ్వ విద్యాలయం చరిత్రలో ఏనాడూ ఇలా సీనియర్ ఐఏఎస్‌తో విచారణ జరిగిన సందర్భం లేదు. మొట్ట మొదటి సారి భారీ విచారణకు ప్రభుత్వం ఉపక్రమించడం చర్చనీయాంశంగా మారింది. ఈ మధ్య (మిగతా 4వ పేజీలో)

చట్టానికి పాతర..

యూనివర్సిటీ చట్టంలో ఫైనాన్స్ కమిటీ (ఆర్థిక కమిటీ) లేకుండా నిధులు డ్రా చేయకూడదని స్పష్టంగా ఉంది. యూనివర్సిటీకి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసే రూ.వందల కోట్ల నిధుల వినియోగం అంతా కూడా ఫైనాన్స్ కమిటీ కనుసన్నల్లోనే జరగాలి. గడచిన రెండేళ్ల నుంచి అలాంటి కమిటీ లేకుండానే నిధులు డ్రా చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అసలు ఇంత వరకు ఫైనాన్స్ కమిటీ ఏర్పాటు చేయక పోవడంపైనే చర్యలు తీసుకోవాలని గవర్నర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. యూనివర్సిటీ చట్టం ప్రకారం ఖచ్చితంగా ఆరుగురు సభ్యులు ఉంటేనే పాలక మండలి సమావేశం నిర్వహించాలి. కానీ ఐదుగురు సభ్యులతోనే మమ అనిపించారు.

వరి పొట్టు నుంచి బయోడిగ్రేడబుల్ ఉత్పత్తులు


బయోడిగ్రేడబుల్ టేబుల్ వేర్ ఉత్పత్తుల తయారీ అంగీకార పత్రాలను ఎమ్మెల్యే నరేంద్ర నుంచి అందుకుంటున్న సంస్థ ప్రతినిధులు

పొన్నూరుటౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు బయోడిగ్రేడబుల్ టేబుల్ వేర్ తయారీ జరగటం ఆహ్వానించదగ్గ పరిణామం అని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. వరి పొట్టు నుంచి బయోడిగ్రేడబుల్ టేబుల్ వేర్ తయారీ ఒప్పంద పత్రాలను మంగళవారం ఎమ్మెల్యే చేతుల మీదుగా సంస్థ ప్రతినిధులు అందుకున్నారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు బయోడిగ్రేడబుల్ ఉత్పత్తులను తయారు చేయాలని సంకల్పించినట్లు చెప్పారు. ముస్సిపల్లె గ్రామంలోని రాయల్ ఆగ్రో ఇండస్ట్రీస్ కొత్త సాంకేతికత వైపు అడుగులు వేస్తున్నట్లు చెప్పారు. వడ్లగింజల పొట్టును ఉపయోగించి బయోడిగ్రేడబుల్ టేబుల్ వేర్, ఒకసారి వాడే ప్లేట్లు, బౌల్స్ టీ కప్పులు, చంచాల తయారీకి రూపకల్పన చేస్తున్నట్లు చెప్పారు. ఇందుకు అవసరమైన సాంకేతికత బదిలీ కోసం రాయల్ ఆగ్రో ఇండస్ట్రీస్, కాకాని అగ్రి వేర్ సంస్థలు సీఎస్ఐఆర్‌కు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఇంటర్ డిసిప్లీనరీ సైన్స్ అండ్ టెక్నాలజీతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు చెప్పారు. నరసరావుపేటలోని అగ్రి వేర్ సంస్థ ఇప్పటికే బయోడిగ్రేడబుల్ టేబుల్ వేర్ ఉత్పత్తిని ప్రారంభించినట్లు చెప్పారు. రాయల్ ఆగ్రో ఇండస్ట్రీస్ త్వరలోనే ఈ ఉత్పత్తిని ప్రారంభించబోతున్నట్లు వివరించారు. పర్యావరణ పరిరక్షణకు వినూత్న ఆలోచనలు చేసిన గుదేటి బాలకృష్ణారెడ్డి, కొల్లా సాంబశివరావును ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

ట్రూడౌన్‌తో వినియోగదారులకు ఊరట

- ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల తగ్గింపు (ట్రూడౌన్)తో వినియోగదారులకు ఊరట కలగుతుందని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. వైసీపీ హయాంలో అడ్డగోలుగా విద్యుత్ చార్జీలు పెంచారని, వాడుకున్న విద్యుత్‌కు బిల్లులు చెల్లిస్తున్నప్పటికీ ట్రూఅప్ చార్జీల పేరుతో వినియోగదారులకు షాక్ ఇచ్చారని పేర్కొన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ట్రూఅప్ చార్జీలు తగ్గిస్తుంటే జగన్ జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శించారు. విద్యుత్ చార్జీల తగ్గింపుతో రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ వినియోగదారులకు రూ.923.55 కోట్ల లబ్ధి చేకూరనుందని చెప్పారు. కాగా, ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు బుధవారం పలువార్డులలో వృద్ధులు, వికలాంగులకు పింఛన్లను పంపిణీ చేయనున్నట్లు పట్టణ పార్టీ అధ్యక్షుడు పిల్లి చెన్నారావు, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు పాండురంగ శ్రీను తెలిపారు. పింఛన్ల పంపిణీ అనంతరం జీఎస్టీ తగ్గింపుపై కలిగే ప్రయోజనాల సమావేశంలో యరపతినేని పాల్గొననున్నట్లు చెప్పారు.

ట్రూడౌన్‌తో నూతన చరిత్ర: ప్రత్తిపాటి

చిలకలూరిపేట, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల తగ్గింపు (ట్రూడౌన్) నూతన చరిత్ర అని, ముఖ్యమంత్రి చంద్రబాబు వినూత్న ఆలోచనా విధానాలతోనే ఇది సాధ్యమైందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మంగళవారం అన్నారు. విద్యుత్ చార్జీలను తగ్గించి మొత్తం రూ.923.55 కోట్లు ప్రజలకే అందివ్వడం శుభపరిణామమని ఆయన పేర్కొన్నారు. ట్రూఅప్‌లకే పరిమితమైన గత పాలకుల చర్యలతో విద్యుత్ భారంతో అల్లాడిపోయిన రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబు ట్రూడౌన్‌ను పరిచయం చేయడం హర్షణీయమని అన్నారు. సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌తో పాటు 50 గజాల్లో నిర్మించే ఇంటి అనుమతి ఫీజును కేవలం ఒక రూపాయిగా నిర్ణయించడం మరో విశేషమని చెప్పారు. దీని వల్ల ఖజానాకు జమయ్యే రూ.4వేల కోట్లను కూడా కాదనుకొని ప్రభుత్వం ప్రజల సంతోషానికే ప్రాధాన్యమిచ్చిందని ప్రత్తిపాటి పేర్కొన్నారు.

వీడని ముంపు

● జల దిగ్బంధంలోనే లంక గ్రామాలు


అరవింద వారధి ఎగువన ఉధృతంగా వరద ప్రవాహం

తెనాలి, కొల్లూరు, దుగ్గిరాల, కొల్లిపర, రేపల్లె, సెప్టెంబరు 30, (ఆంధ్రజ్యోతి): కృష్ణానది వరద కారణంగా గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలోని లంక గ్రామాలకు దారులు మూసుకు పోయాయి. అత్యవసర సాయం కోసం పడవలను ఏర్పాటు చేశారు. సముద్ర తీర గ్రామాల్లో రొయ్యల చెరువులకు ఊహించని దెబ్బతగిలితే, కృష్ణా తీరంలోని గ్రామాల్లో వాణిజ్య పంటలకు నష్టం తప్పడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. వరద ముంపులోనే అరటి, పసుపు, కంద, తమలపాకు వంటి పటలు ఉన్నాయి. కూరగాయలు, పూల తోటలు మాత్రం పనికిరాకుండా పోయాయి.

తగ్గినట్టే తగ్గి మళ్లీ పెరుగుతూ...

కృష్ణా నదికి వస్తున్న వరద తగ్గినట్టే తగ్గి, ఇంతలోనే పెరిగిపోతోంది. సోమవారం రాత్రి 6,39,737 క్యూసెక్కులకు వరద తగ్గితే, మంగళవారం సాయంత్రానికి 6,53,828 క్యూసెక్కులకు పెరిగింది. రాత్రికి ప్రకాశం బ్యారేజి దగ్గర నీటి మట్టం మళ్లీ 16.1 అడుగులకు చేరింది.

జల దిగ్బంధంలోనే లంక గ్రామాలు

గుంటూరు జిల్లా కొల్లిపర మండలం కొత్తూరు లంక, అన్నవరపులంక, కృష్ణా జిల్లాకు చెందిన మరి కొన్ని లంకలు నేటికీ జలదిగ్బంధంలోనే ఉన్నాయి. అత్యవసర సేవల కోసం ఎన్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచారు. అత్యవసర ఆరోగ్య సేవలు కోసం మాత్రమే పడవలను సిద్ధంచేశారు. బాపట్ల జిల్లాలోని కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె మండలాల్లోని లంక గ్రామాలకే తీరని నష్టం ఏర్పడింది. దోనేపూడి, వెల్లటూరు దగ్గర చిన్న రేవులోకి నీరు రావడంతో రాకపోకలు ఆపేశారు. దోనేపూడి దగ్గర పడవను ఏర్పాటు చేస్తే, వెల్లటూరు దగ్గర మాత్రం ద్విచక్ర వాహనాలను కూడా వెళ్లనివ్వకుండా ఆపేస్తున్నారు. కేవలం ట్రాక్టర్లపైనే నీటిని దాటేందుకు అవకాశం కల్పిస్తున్నారు. భట్టిప్రోలు మండలంలోని పెసర్లంక, పెదలంక, చింతమోటు, కొల్లూరు మండలంలోని జువ్వలపాలెం, కిష్కిందపాలెం, గుంటూరుగూడెం, తిప్పలకట్ట, పోతార్లంక, మరికొన్ని గ్రామాలు జలదిగ్బంధంలోనే ఉన్నాయి. మరోపక్క ఓలేరు పల్లెపాలెం, పెనుమూడి దగ్గర మాత్రం కరకట్టకు, నదికి మధ్య నున్న ఈ రెండు గ్రామాల్లోకి నీరు రావడంతో ఖాళీ చేయించారు. ఈ రెండు గ్రామాల నుంచి 500 మంది కిపైగా జనాన్ని పెనుమూడి, ఓలేరు పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించారు.


రేపల్లె : ఓలేరు పల్లెపాలెం సమీపంలో వరద నీటిలో నానుతున్న అరటి మొక్కలు

రైతుల ఆశలు ఆవిరి

సముద్ర తీరంలోని భట్టిప్రోలు మండలం ఓలేరు, రేపల్లె మండలం రావి అనంతవరం, పెనుమూడి, లక్ష్మీపురం, రాజుకాల్వ, లంకెవానిదిబ్బ గ్రామాల్లో సుమారు 800 ఎకరాల చెరువలను వరద నీరు ముంచేసింది. 20 రోజుల్లో చేతికొచ్చే స్థితిలో ఉన్న రొయ్యలు నదిలో కలిసిపోయాయి. మొత్తంమీద రూ. 25 కోట్ల వరకు నష్టం తప్పదని రైతులు చెబుతున్నారు.

మంత్రి అనగాని పరిశీలన

వరద బాధితులు ఎవరూ ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని మంత్రి అనగాని భరోసాను ఇచ్చారు. మంగళవారం రేపల్లె మండలం పెనుమూడి కృష్ణానది వరద ఉధృతిని ఆయన పరిశీలించారు. కరకట్ట పటిష్టతపై అధికారులను ఆరా తీశారు. కరకట్టకు నిబంధనలకు విరుద్ధంగా వేసిన పైపు లేన్ల గురించి ఆర్‌సీ ఏఈ నాగేశ్వర్‌నాయక్ మంత్రికి వివరించారు. తక్షణమే పైప్‌లైన్‌లను తొలగించాలని.. ఎవరి సిఫార్సుచేసిన వినవద్దని స్పష్టం చేశారు. కరకట్ట పటిష్టతకు రూ.300కోట్లతో ప్రతిపాదనలు పంపించామన్నారు. వరద ఉధృతి ఇంకో ఐదురోజుల పాటు ఉంటుందని, అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని సూచించారు.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం : ఆనందబాబు

ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు కొల్లూరు మండలంలోని లంక గ్రామాల్లో వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. వరద తగ్గిన వెంటనే పంట నష్టం సర్వే నిర్వహించి పరిహారం అందించే విధంగా కృషి చేస్తామన్నారు. సాధారణ పరిస్థితులు నెలకొనే వరకు వరద ముంపు ప్రాంతాల్లో తాను పర్యటిస్తానని ప్రజలకు భరోసా కల్పించారు.

ప్రకాశం బ్యారేజి వద్ద భారీగా వరద నీరు

● దిగువకు 6,53,828 క్యూసెక్కులు విడుదల ● కొనసాగుతోన్న రెండో ప్రమాద హెచ్చరిక


ప్రకాశం బ్యారేజి దిగువకు విడుదలవుతున్న కృష్ణానది వరద నీరు

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టుతోపాటు మున్నేరు, వెలగలేరు, కీసర తదితర ప్రధాన వాగుల నుంచి బ్యారేజికి 6,69,188 క్యూసెక్కుల వరద నీరు మంగళవారం ఇన్‌ఫ్లోగా నమోద యినట్లు ఇరిగేషన్ జేఈ రాజేశ్ తెలిపారు. బ్యారేజీ రిజర్వాయర్‌లో 16.1 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా దిగువకు 6,53,828 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తూర్పు డెల్టా కాలువకు 8,334 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 7,026 క్యూసెక్కులు వదులుతుండగా గుంటూరు చానల్‌కు నీటి విడుదలను నిలిపివేశారు. ప్రకాశం బ్యారేజీ వద్ద రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతుండడంతో దిగువ నది తీర ప్రాంత వాసులు, లంక భూముల రైతులు మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

వ్యవసాయ వర్సిటీకి మాయని మచ్చ!

(3వ పేజీ తరువాయి)

విడుదలైన జాతీయస్థాయి విశ్వవిద్యాలయాల ర్యాంకుల్లో కూడా ఎన్‌జీ రంగా యూనివర్సిటీ అట్టడుగు స్థాయికి చేరింది. లబ్ద ప్రతిష్ఠులైన వ్యవసాయ శాస్త్రవేత్తలు యూనివర్సిటీలో చాలా మంది ఉన్నప్పటికీ పరిశోధనలకు సంబంధించిన అంశాలపై ముందరి కాళ్లకు బంధనాలువేస్తున్న పరిస్థితి అక్కడ నెలకొన్నట్లు తెలుస్తోంది.

చెల్లని నిర్ణయాలు

వ్యవసాయ విశ్వ విద్యాలయంలో పనిచేసి పదవీ విరమణ పొందిన కొందరు శాస్త్రవేత్తలు ఈ మధ్య కాలం లో సీఎంఓలో ఒక ఫిర్యాదు అందజేశారు. కోరం లేకుండా తీసుకున్న ప్రతి నిర్ణయం చట్ట విరుద్ధమని, వాటి పై సమీక్ష నిర్వహించాలని అందులో కోరారు. ఐదుగురు సభ్యులతో మాత్రమే నిర్వహించిన పాలక మండలి సమావేశంలో ప్రమోషన్లు, బదిలీలు, నియామకాలు, రూ.1.25 కోట్లతో కార్ల కొనుగోలు వంటి కీలకమైన నిర్ణయాలు తీసుకున్నారు. అవి చెల్లుబాటు కావన్నది విశ్రాంత శాస్త్రవేత్తల వాదన.

పాలక మండలి సభ్యులు ఉన్నా..

గత ప్రభుత్వం వ్యవసాయ విశ్వ విద్యాలయానికి పాలక వర్గం నియమించింది. వారిలో ఎక్కువ మంది ప్రభుత్వం మారిన తర్వాత రాజీనామా చేశారు. ముగ్గురు మాత్రం ఈ రోజుకీ రాజీనామా చేయలేదు. పాలక మండలి సమావేశం ఏర్పాటు చేస్తే.. రిజిస్ట్రార్ వారికి తగిన సమాచారం ఇవ్వాలి. కానీ ఒక్క సమావేశానికి కూడా వారికి ఆహ్వానం పంపలేదని తెలుస్తోంది.

ప్రియుడి మోజులో భర్త హత్య

● రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేందుకు భార్య యత్నం
● కేసును ఛేదించిన మేడికొండూరు పోలీసులు


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్, పక్కన మేడికొండూరు సీఐ నాగూర్ మీరా

గుంటూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రియుడి మోజులో పడిన ఓ మహిళ ఆస్తి కోసం.. తన భర్తను హత్య చేయిచింది. అనంతరం హత్యను రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే యత్నం చేశారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన మేడికొండూరు పోలీసులు నిందితులు అదుపులోకి తీసుకుని విచారించడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ నిందితులను మీడియా ఎదుట హాజరుపరచి కేసు వివరాలు వెల్లడించారు. హతుడు ఆటో డ్రైవర్ చెన్నంశెట్టి గోవిందరాజుకు లక్ష్మితో 15 ఏళ్ల క్రితం వివాహమైంది. గోవిందరాజు నిత్యం మద్యం తాగి వేధిస్తుండడంతో లక్ష్మి ఆరేళ్ల నుంచి విడిగా సత్తెనపల్లిలో ఉంటూ క్యాటరింగ్‌కు వెళ్తోంది. ఈ క్రమంలో ఆమెకు పేర్నేపాటి వెంకటేశ్వర్లు అలియాస్ వెంకట్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడి.. మూడేళ్ల నుంచి వివాహేతర సంబంధం కొనసాగిస్తోంది. అయితే లక్ష్మికి తన అత్తమామల నుంచి ఆస్తి రావాల్సి ఉంది. తన భర్త గోవిందరాజు దాన్ని తనకు దక్కనీయడని.. భావించిన లక్ష్మి అతనిని అడ్డు తప్పించాలని భావించింది. ప్రియుడు వెంకట్ విషయం చెప్పడంతో.. అతను అంగీకరించి తన స్నేహితుడు షేక్ ఖాసిం సైదా అలియాస్ అండాతో కలిసి ఈ నెల 18న ఆటోలో గోవిందరాజు ఇంటికి వెళ్లాడు. వెంకటేశ్వర్లుకు గోవిందరాజుతో పరిచయం ఉండటంతో మద్యం తాగుదామని.. అతన్ని ఆటోలో ఎక్కించుకొని సాతులూరు, పెదరెడ్డిపాలెం గ్రామాల మధ్యలో గల సాగర్ కాలువ వద్దకు తీసుకెళ్లారు. అక్కడ మద్యం తాగుతూ గోవిందరాజుతో గొడవ పెట్టుకున్నారు. అతన్ని కొట్టి, మొల తాడను గొంతుకు బిగించి లాగడంతో స్పృహతప్పి పడిపోయాడు. అటువైపు ఎవరో వస్తున్నట్టు అలికిడి విని గోవిందరాజును సత్తెనపల్లి మండలంలోని అబ్బూరు గ్రామ శివారులోకి తీసుకెళ్లారు. మెడను ఆటో రాడ్‌కు ఆనించి గట్టిగా అదమడంతో గోవిందరాజు రక్తం కక్కి, నాలుక కొంచం బయటకు పెట్టి చనిపోయాడు. అనంతరం రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేందుకు గోవిందరాజు మృతదేహాన్ని పెద్ద పలకలూరు రోడ్డుపై పడేశారు. అయితే మృతుడి నాలుక బయటకు ఉండడంతో మేడికొండూరు పోలీసులు అనుమానాస్పద కేసుగా నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. సీసీ కెమెరాలు పరిశీలించగా వారికి అనుమానాస్పద రీతిలో ఓ ఆటో కనిపించింది. దాని యజమానిని ప్రశ్నించగా ఆటోను కొద్దిరోజుల సత్తెనపల్లికి చెందిన పేర్నేపాటి వెంకటేశ్వర్లు అలియాస్ వెంకట్ అమ్మినట్లు చెప్పాడు. దీంతో పోలీసులు ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించారు. కేసు ఛేదించిన మేడికొండూరు ఎస్సై నాగూర్ మీరా సాహెబ్‌ను, ఎస్సైలు ఖాజీ బాబు, సుబ్బారావు, కానిస్టేబుళ్లు జాన్ సైదా, సురేష్, నాగేశ్వరరావు, బాజీ సాహెబ్, లక్ష్మీదేవిని ఎస్పీ అభినందించి, ప్రశంసా పత్రాలను అందించారు.

చెస్‌తో స్వీయ పరిశీలన శక్తి పెంపు

● ఎమ్మెల్యే డాక్టర్ కామినేని ● నేటితో ముగియనున్న చెస్ పోటీలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

గుంటూరు విద్య సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): చదరంగం ద్వారా స్వీయ పరిశీలనా శక్తి పెరుగుతుందని, స్వీయ అభివృద్ధికి ఈ ఆట దోహదం చేస్తుందని కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో "62వ నేషనల్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు" హోరాహోరీగా కొనసాగుతున్నాయి. మంగళవారం కామినేని పోటీలను పరిశీలించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ముందుగా ఒక ఎత్తువేసి పోటీలను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ, చదరంగం ఆడటం వల్ల మెదడు పదునెక్కుతుందని, సమస్యల పరిష్కారానికి తక్షణ నిర్ణయాలు తీసుకునే శక్తి పెరుగుతుందని అన్నారు. ముందుగానే ప్రత్యర్థి ఆలోచనలను అంచనా వేసే గుణంతో పాటు అనుకోని పరిస్థితుల్లో ప్రశాంతంగా ఉండే లక్షణాలు పెరుగుతా యని చెప్పారు. 'ఒక కదలికకు పది ఫలితాలు' అనే దృక్పథాన్ని చెస్ నేర్పు తుందని కామినేని పేర్కొన్నారు. కార్యక్రమంలో చెస్ క్రీడాకారులు లంకా రవి, విజ్ఞాన్ విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.30 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	125, 134 145
చికెన్ విత్ స్కిన్(కిలో)	236.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	246.00

బాపట్ల, తెనాలి ట్రాక్షన్ సబ్‌స్టేషన్ల సామర్థ్యం పెంపు

● 3 వేల ఎంటీల లోడింగ్ లక్ష్యంగా స్పెషల్ రైల్వే ప్రాజెక్టు

గుంటూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): బాపట్ల, తెనాలి ట్రాక్షన్ సబ్‌స్టేషన్ల సామర్థ్యం పెంపునకు దక్షిణ మధ్య రైల్వే నిర్ణయించింది. మూడు వేల ఎంటీల లోడింగ్ లక్ష్యంగా ఈ స్పెషల్ రైల్వే ప్రాజెక్టు పనులు కొనసాగనున్నాయి. ముఖ్యంగా గూడ్స్ రైళ్లు ఎక్కువగా రాకపోకలు సాగించే తెనాలి, బాపట్ల రైల్వేస్టేషన్ల వద్ద ట్రాక్షన్ సబ్‌స్టేషన్ల సామర్థ్యాన్ని పెంచుతారు. ఇందు కోసం భూసేకరణ అవసరం కావడంతో రైల్వేశాఖ స్పెషల్ రైల్వే ప్రాజెక్టుగా ప్రకటించింది. ఈ పనుల వల్ల ట్రాన్స్‌మిషన్ నష్టాలు వంటివి చాలావరకు తగ్గిపోతాయి. గుంటూరు-తెనాలి సెక్షన్‌లోనూ ఈ తరహా పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

డ్రగ్స్ నియంత్రణ, లా అండ్ ఆర్డర్‌ను పటిష్టపరచండి

- ఎస్పీ వకుల్ జిందాల్‌ను కలిసిన ఎమ్మెల్యే నసీర్


ఎస్పీని సన్మానిస్తున్న ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో, ప్రధానంగా గుంటూరు నగరంలో డ్రగ్స్ నియంత్రణ, లా అండ్ ఆర్డర్‌ను పటిష్టపరచాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ మంగళవారం ఎస్పీ వకుల్ జిందాల్‌ను కోరారు. స్థానిక పోలీస్ కార్యాలయంలో ఎస్పీ వకుల్ జిందాల్‌ను ఎమ్మెల్యే నసీర్ కలిశారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై ఎస్పీకి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ కుటుంబ వివాదాల పరిష్కారానికి ఐదుగురు సభ్యులతో కౌన్సెలింగ్ కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు. దీంతోపాటు డ్రగ్స్ నియంత్రణపై ఒక కమిటీని నియమించాలన్నారు. గడ్డిపాడు, ఆటోనగర్ వంటి ప్రాంతాలు పెదకాకాని స్టేషన్ పరిధిలో ఉన్నాయని అందువల్ల ఆ ప్రాంతాలలో కేసుల విచారణలో జాప్యం జరుగుతుందని తెలిపారు. ఆ ప్రాంతాలను గుంటూరు అర్బన్ పరిధిలోకి మార్చాలని కోరారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో మూడు స్టేషన్లు ఉన్నాయని, వీటితోపాటు మరో పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని విన్నవించారు. వీటిపై ఎస్పీ వకుల్ జిందాల్ సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే నసీర్ తెలిపారు.

దసరా కానుకగా ఆటోడ్రైవర్లకు రూ.15 వేలు

దసరా కానుకగా ఆటో డ్రైవర్లకు రూ.15 వేలతో కూటమి ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పిస్తోందని తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఎమ్మెల్యే నసీర్ మాట్లాడారు. కార్మికులకు పూర్తి అండదండలు అందించటమే సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఆటో డ్రైవర్లకు రూ.10 వేలు ఇచ్చి ట్యాక్స్ ల రూపంలో వేల రూపాయలు దండుకున్నారని విమర్శించారు. జగన్ పాలనలో గ్రీన్ ట్యాక్స్ రూ.10 వేల వరకు వసూలు చేశారని గుర్తు చేశారు. తాజాగా గ్రీన్ ట్యాక్స్ తగ్గించడం ద్వారా లారీ యజమానులకు చంద్రబాబు మేలు చేశారని అన్నారు.

విద్యాదానం మహా పుణ్యకార్యం

విద్యా దానం మహా పుణ్యకార్యమని తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ తెలిపారు. సంగడిగుంట రెడ్లబజారులోనున్న శ్రీ కనకదుర్గమ్మ ఆలయంలో కమిటీ ఉపాధ్యక్షుడు మద్దిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పుస్తకాలు, పెన్నులను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజంలో పేద విద్యార్థులకు సహాయ సహకారాలు అందించేందుకు పెద్దలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సంకూరి శ్రీనివాసరావు, కమిటీ అధ్యక్షుడు మారెడ్డి శ్రీనివాసరెడ్డి, శివారెడ్డి, కల్లి శ్రీనివాసరెడ్డి, మోరబోయిన నరసింహారావు, వెంకారెడ్డి తదితరులున్నారు.

అమెరికా ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటే తీవ్ర నష్టం

- మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : భారత దేశంలోకి అమెరికా వ్యవసాయ ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటే వ్యవసాయ రంగానికి ఉరితాడు బిగించినట్టేనని మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికా సుంకాలు-దేశంపై ప్రభావం అనే అంశంపై స్థానిక బ్రాడీపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో మంగళవారం సదస్సు నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజి అధ్యక్షతన జరిగిన సదస్సులో కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ఆక్వా ఎగుమతులపై 60 శాతం అమెరికా సుంకాల కారణంగా ఆంధ్రప్రదేశ్‌లో ఆక్వా పరిశ్రమ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటుందని వివరించారు. అదేవిధంగా ఇండియాలో తయారయ్యే దుస్తుల్లో 65 శాతం అమెరికాకు ఎగుమతి అవుతాయని, ఇప్పుడు ఈ రంగం కూడా సంక్షోభంలో ఉందన్నారు. అమెరికా కోసం మోదీ దేశ ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారని మండిపడ్డారు. ప్రొఫెసర్ డీఏఆర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ 2016 ఎన్నికల నుండే ట్రంప్ సంకుచిత విధానాన్ని పాటిస్తున్నాడని అన్నారు. ఒకప్పుడు ఫ్రీ ట్రేడ్ అని, ఇప్పుడు సుంకాలు వేస్తున్నారన్నారు. ఈ సదస్సులో కె.నళినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కేఎస్ లక్ష్మణరావు, పాల్గొన్న నేతాజీ తదితరులు

పేదరికం విద్యకు అడ్డుకాకూడదు

- పేద విద్యార్థులకు రూ.45 వేల ఆర్థిక సాయం

గుంటూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పేదరికం విద్యకు అడ్డుకాకూడదని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కోనూరు సతీష్‌శర్మ అన్నారు. ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఆధ్వర్యంలో గాయత్రీ విద్యా పథకం కింద దుర్గాష్టమి రోజున సీఎస్సీ బీటెక్ మొదటి సంవత్సరం చదువుతోన్న కొండకావూరి దేదీప్యకు రూ.35 వేలు, పదవతరగతి చదువుతున్న హర్షిణికి మరో రూ.10వేలు చెక్ ద్వారా వారి తల్లి కొండకావూరి శైలజకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి పులిపాక ప్రసాద్, మునిపల్లె నరసింహారావు పాల్గొన్నారు.

రేపు సాయినాథుని మహా సమాధి మహోత్సవం

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : స్థానిక విద్యానగర్ 3వ లైన్‌లోని శ్రీ సాయినాథ సన్నిధానంలో గురువారం విజయదశమి నాడు శ్రీ సాయినాథుని మహాసమాధి మహోత్సవం నిర్వహిస్తున్నట్టు ఆలయ గౌరవ అధ్యక్షుడు యడ్లపాటి అశోక్‌కుమార్, అధ్యక్షుడు వడ్లమూడి శివరామకృష్ణయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా బాబాకు పంచామృతాభిషేకం, చందనార్చన, దీప మహోత్సవం, సమాధిపూజ. సమాధి హారతి జరుగుతాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బాబా వారి ఆశీస్సులు పొందాలని కోరారు.

స్తంభాలగరువులో ద్విచక్ర వాహనాలు దగ్ధం

గుంటూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని స్తంభాలగరువు నుంచి శ్యామలనగర్ వెళ్లే రోడ్డులో సోమవారం అర్ధరాత్రి ఆగంతకులు దుశ్చర్యకు పాల్పడ్డారు. మధుసూదన్‌రెడ్డికి చెందిన బడ్డీ బంకును, అదేవిధంగా ఇంటి ముందు పార్కు చేసిన శివరామ్‌కు చెందిన రెండు ద్విచక్ర వాహనాలకు నిప్పు పెట్టారు. మధుసూదన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మిర్చి ట్రేడర్లు, లారీ ఓనర్ల మధ్య ముదిరిన వివాదం

- లారీల బంద్‌కు ఓనర్ల సిద్ధం..!
- ప్రభుత్వంతోనే తేల్చుకుంటామన్న ట్రేడర్లు

గుంటూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మిర్చి ఎగుమతిదారులు, ఈశాన్య రాష్ట్రాలకు మిరపకాయల టిక్కీలను రవాణా చేసే లారీ యజమానుల మధ్యన తలెత్తిన వివాదం తీవ్రరూపం దాలుస్తోంది. గత వారం శ్రీ అమరావతి నేషనల్ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌ని ఆటోనగర్‌లో ఏర్పాటు చేశారు. దీనికి కొత్త పాలకవర్గాన్ని ఎన్నుకొన్నారు. తొలుత లారీ కిరాయిల విషయంలో తాము తలదూర్చబోమని చెప్పి ఆ తర్వాత ఈశాన్య రాష్ట్రాల్లోని ప్రాంతాల వారీగా కిరాయిలు నిర్ణయించారని వ్యాపారస్తులు పేర్కొన్నారు. ఇదే విషయాన్ని మార్కెటింగ్ అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లారు. ఇరువర్గాలతో జాయింట్ కలెక్టర్ సమావేశమై చర్చిస్తారని ఏఎంసీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ. చంద్రిక ప్రకటించారు. మంగళవారం లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశమై ఒక ప్రకటనను విడుదల చేసింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం లోడు ఎత్తు 13 అడుగులు ఉండాల్సి ఉంటే ట్రేడర్లు 17 అడుగుల వరకు చేయిస్తున్నారని లారీ ఓనర్లు ఆరోపించారు. ఈ కారణంగా ప్రతి రాష్ట్రంలో చలానాల రూపంలో రూ. 20 వేల నుంచి రూ. 30 వేల వరకు అదనంగా చెల్లించాల్సి వస్తోందని పేర్కొన్నారు. గతంలో లారీ కిరాయి భూమ్రా ప్రాంతానికి 20 టన్నులకు రూ. 1.70 లక్షలుంటే ప్రభుత్వం గ్రీన్‌ట్యాక్స్ భారాన్ని రద్దు చేయడంతో దానిని తాము రూ. 1.35 లక్షలకు తగ్గించుకున్నట్లు తెలిపారు. టోల్ ట్యాక్స్ గతంలో కంటే 25 శాతం పెరిగిందని, దీని వల్ల ప్రతి కిలోమీటరుకు రూ. 10 అదనంగా ఖర్చు వస్తోందని చెప్పారు. మిర్చి లోడింగ్‌కు యార్డులో గుమాస్తా ఖర్చులు రూ. 8 వేలు, దిగుమతి జరిగే ప్రాంతంలో రూ. 10 వేలు వసూలు చేస్తున్నారని, తాము ఇన్ని ఇబ్బందులు పడుతుంటే ఇవేమి పరిగణనలోకి తీసుకోకుండా తమపై కక్షపూరితంగా ట్రేడర్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారని లారీ ఓనర్లు ఆరోపించారు. ఈ ధోరణికి నిరసనగా తాము లారీల నిలుపుదలకు సిద్ధపడుతున్నట్లు ప్రకటించారు. దీనిపై ట్రేడర్లు స్పందిస్తూ, లారీ కిరాయిలు తగ్గడం వల్లే 10 లక్షల టిక్కీలు ఖమ్మం, వరంగల్, కర్ణాటక నుంచి ఇక్కడికి వచ్చాయని, దీని వల్ల వ్యాపారం పెరగడంతో ప్రభుత్వానికి మార్కెటింగ్ ఫీజు కూడా బాగా వచ్చిందన్నారు. తాము ట్రేడ్‌ను నిలిపేయబోమని, లారీలు కిరాయికి దొరకకపోతే ప్రభుత్వమే స్పందించాల్సిన పరిస్థితి తలెత్తుతుందని వారు పేర్కొంటున్నారు. ప్రభుత్వం కలగజేసుకొని ఈ సమస్యను త్వరగా తీర్చకపోతే ఇది మరింత ముదిరే అవకాశం కనిపిస్తోంది.

అరండల్‌పేట సెంట్రల్ డివైడర్ ఫెన్సింగ్ దొంగల పాలు


అరండల్‌పేట సెంట్రల్ డివైడర్‌కు ఉన్న ఐరన్ ఫెన్సింగ్‌ని చోరీ చేసిన చిత్రం

గుంటూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): అరండల్‌పేట మెయిన్‌రోడ్డులోని సెంట్రల్ డివైడర్‌కు ఉన్న ఐరన్ ఫెన్సింగ్‌ని రోజుకు కొంతభాగం చొప్పున దొంగలు విరుచుకెళుతున్నారు. ఇప్పటికే చాలాభాగం ఫెన్సింగ్ చోరీకి గురైంది. శంకర్‌విలాస్ ఆర్‌వోబీ కూల్చివేత కారణంగా ఈ మార్గంలో జన సంచారం రాత్రి వేళ తక్కువగా ఉండటం, కూతవేటు దూరంలోనే అరండల్‌పేట పోలీసుస్టేషన్ ఉన్నప్పటికీ గస్తీ తక్కువగా ఉండటంతో దొంగల పని సులవైంది. బలవంతంగా ఫెన్సింగ్‌ని వంచుతూ ఎంతవరకు కట్ అయితే అంతవరకు తీసుకెళ్లిపోతున్నారు. దీని వలన వంచిన ఐరన్ ఫెన్సింగ్ రోడ్డుపై అడ్డంగా వస్తుంది. ఇది రాత్రివేళల్లో కనిపించక వాహనదారులు ప్రమాదాలకు గురౌతున్నారు. ఇప్పటికే ఒక ద్విచక్ర వాహనదారుడు తీవ్రంగా గాయపడి ఆస్పత్రి పాలయ్యాడు. మంగళవారం ఒక ఆటో ఆ ఫెన్సింగ్‌ని ఢీకొని ముందుభాగం నుజ్జునుజ్జు అయింది. ఈ నేపథ్యంలో నగరపాలకసంస్థ అధికారులు తక్షణమే ఐరన్ ఫెన్సింగ్ మొత్తాన్ని తొలగించి ప్రమాదాలను నివారించాలని వాహనదారులు కోరుతున్నారు.

7న విజయవాడలో ఫ్యాప్టో ధర్నా

గుంటూరు విద్య, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యలపై ప్రభుత్వ మొండివైఖరికి నిరసనగా అక్టోబరు 7వ తేదీన విజయవాడలో ధర్నా నిర్వహించనున్నట్లు నాయకులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఏపీటీఎఫ్ కార్యాలయంలో పోస్టర్స్ ఆవిష్కరించారు. ధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ ఫ్యాప్టో రాష్ట్ర పరిశీలకులు నక్కా వెంకటేశ్వర్లు, గుత్తా శ్రీనివాసరావు, జిల్లా ఫ్యాప్టో చైర్మన్ కె.నరసింహారావు జిల్లాలోని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు, ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మేకల సుబ్బారావు, ఫ్యాప్టో జిల్లా డిప్యూటీ సెక్రటరీ జనరల్ ఎండి ఖలీద్, ఫ్యాప్టో జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.కళాధర్, జి.వెళాంగిణి రాజు, ఫ్యాప్టో జిల్లా నాయకులు దిబ్బయ్య (ఎస్‌టీయూ), ఎం.కోటిరెడ్డి (యూటీఎఫ్), షేక్ బాజి (ఎస్‌టీయూ), బీ బాలాజీ (ఎస్సీ ఎస్టీ, ఎస్టీయూ) ఎంవి ప్రసాద్ (ఏపీటీఎఫ్ 1938), జే.విజయానంద్ (ఏపీటీఎఫ్ 1938) తదితరులు పాల్గొన్నారు.

వైద్యం ప్రైవేటు పరం చేయటం దుర్మార్గం : వైసీపీ

గుంటూరు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): వైద్యం ప్రైవేటు పరం చేయటం దుర్మార్గమని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ కళాశాలలను ప్రైవేటు పరం చేస్తున్నారంటూ వైసీపీ ఆధ్వర్యంలో మంగళవారం లాడ్జి సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అప్పిరెడ్డి మాట్లాడుతూ వైద్య కళాశాలలను ప్రైవేటు పరం కానివ్వకుండా ప్రజా పోరు కొనసాగిస్తామన్నారు. ప్రభుత్వ వైఖరి మార్చుకునే వరకు ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. నిరసనలో మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, నేతలు వనమా బాలవజ్రబాబు, వేమారెడ్డి, అంబటి మురళీకృష్ణ తదితరులున్నారు.

డాక్టర్స్ ప్రీమియర్ లీగ్ విజేత శ్రీ సూపర్ కింగ్స్

గుంటూరు మెడికల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) గుంటూరు శాఖ ఆధ్వర్యంలో నగరంలో నిర్వహించిన బ్యాడ్మింటన్ డాక్టర్స్ ప్రీమియర్ లీగ్ పోటీల్లో శ్రీ సూపర్ సిక్స్ జట్టు విజేతగా నిలిచింది. సెప్టెంబరు 22న ప్రారంభమైన ఈ టోర్నమెంటులో మొత్తం పది టీమ్‌లు పోటీ పడ్డాయి. గుంటూరు, విజయవాడ నగరాలకు చెందిన వంద మంది డాక్టర్లు ఇందులో పాల్గొన్నారు. సోమవారం రాత్రి జరిగిన ఫైనల్స్‌లో శ్రీ సూపర్ సిక్స్, సందీప్ స్ట్రైకర్స్ జట్లు పోటీ పడ్డాయి. ఇందులో 3-1 తేడాతో శ్రీ సూపర్ సిక్స్ జట్టు విజయం సాధించి ట్రోఫీని కైవశం చేసుకుంది. అనంతరం జరిగిన బహుమతి ప్రధానోత్సవ సభకు ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ ఎస్ అమర్‌నాథ్ హాజరయ్యారు. విజేతగా నిలిచిన శ్రీ సూపర్ సిక్స్ జట్టు కెప్టెన్, గ్యాస్ట్రోఎంటిరాలజిస్ట్ డాక్టర్ కే కళ్యాణ్ చక్రవర్తికి ట్రోఫీని అందజేశారు.

ఉద్యోగ విరమణ పొందిన ఎస్సై ఆనంద్ కుమార్‌కు ఘన సన్మానం

గుంటూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో ఉద్యోగ విరమణ పొందిన ఎస్సై ఆనంద్ కుమార్ కుటుంబాన్ని పోలీస్ అధికారులు ఘనంగా సత్కరించారు. జిల్లా అదనపు ఎస్పీ రమణ మూర్తి దుశ్శాలువ కప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అదనపు ఎస్పీ మాట్లాడుతూ భవిష్యత్తులో కుటుంబ సభ్యులతో సుఖసంతోషాలతో, ఆరోగ్యంగా గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు శ్రీహరిరెడ్డి, సురేష్, శ్రీనివాసరావు, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ధార్మిక ప్రాంగణంలో భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో మాసశివరాత్రి సందర్భంగా మంగళవారం విశ్వశాంతిని కాంక్షిస్తూ చండీహోమం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతులచే 9 మంది వేదపండితుల నిర్వహణలో గణపతికి, శివలింగానికి, నవగ్రహాలకు విశేష అభిషేకాలు, అర్చనలు, రుద్ర, లక్ష్మీగణపతి, చండీ హోమాలు నిర్వహించి పూర్ణాహుతి చేశారు.

రైల్వే టీటీఐకి జావెలిన్ త్రోలో కాంస్య పతకం

గుంటూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే డివిజన్‌లో ట్రావెలింగ్ టిక్కెట్ ఇన్‌స్పెక్టర్ (టీటీఐ)గా విధులు నిర్వహిస్తోన్న రష్మి శెట్టి 64వ జాతీయ ఓపెన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ జావెలిన్ త్రో విభాగంలో మెరిశారు. ఆమె కాంస్య పతకం సాధించి గుంటూరు రైల్వేకు గర్వకారణంగా నిలిచారు. అంకితభావం, పట్టుదల, క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ రష్మిశెట్టి కాంస్య పతకాన్ని గెలుచుకొన్నారని పలువురు రైల్వే అధికారులు ప్రశంసించారు. ఈ సందర్భంగా డీఆర్ఎం సుధేష్ణ సేన్ మాట్లాడుతూ రష్మి శెట్టి గుంటూరు రైల్వే డివిజన్‌కు గర్వకారణంగా నిలిచారన్నారు. ఉద్యోగులు తమ విధుల్లోనే కాకుండా క్రీడారంగంలో కూడా రాణించడానికి రైల్వే శాఖ ఎల్లప్పుడూ ప్రోత్సాహం అందిస్తుందన్నారు.


జావెలిన్ త్రోలో కాంస్య పతకం సాధించిన రైల్వే టీటీఐ రష్మి శెట్టి (కుడివైపున ఉన్న క్రీడాకారిణి)

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

- ఎమ్మెల్సీ ఆలపాటికి పండిత పరిషత్ విజ్ఞప్తి

గుంటూరు (విద్య) సెప్టెంబరు 30 (ఆంధ్ర జ్యోతి): ఉమ్మడి జిల్లాలో డీఈఓ పూల్‌లో ఉన్న హిందీ, తెలుగు ఉపా ధ్యాయ సమస్యలు పరి ష్కరించాలని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసా ద్‌కు ఆర్‌యూపీపీ (రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్) నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం లక్ష్మీపురంలోని ఎమ్మెల్సీ కార్యాలయంలో ఆలపాటిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనేకసార్లు పండిత పరిషత్ ఆధ్వర్యంలో డీఈఓ పూల్ తెలుగు, హిందీ భాష పండితుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చామన్నారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు ఆర్‌యూపీపీ నాయకులు పి.సాంబయ్య, కె.సతీష్ బాబు, ఎన్.భాస్కరరావు, పి.శశికిరణ్, కె.సాయిబాబు, వీ నటరాజ్ తదితరులు వెల్లడించారు.

చేనేత వస్త్రాలను ప్రతిబింబిస్తూ దసరా వేడుకలు

- డాక్టర్ పెమ్మసాని శ్రీరత్న


అమెరికాలో స్నేహితురాళ్లతో కలిసి దసరా, బతుకమ్మ వేడుకలు చేసుకొంటున్న డాక్టర్ పెమ్మసాని శ్రీరత్న

గుంటూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : అమెరికా దేశంలో చేనేత వస్త్రాలను ప్రతిబింబిస్తూ దసరా వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ సతీమణి డాక్టర్ పెమ్మసాని శ్రీరత్న పేర్కొన్నారు. మంగళగిరితో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో కొనుగోలు చేసిన చేనేత వస్త్రాలను ఆమె అమెరికా తీసుకెళ్లి అక్కడి మహిళలతో కలిసి దసరా, బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీరత్న మాట్లాడుతూ సమాజంలో ఆడవాళ్లను ఒక శక్తి స్వరూపంగా, దేవీ అవతారాలుగా పోలుస్తుంటారని చెప్పారు. సరస్వతి, లక్ష్మి, అన్నపూర్ణదేవి వంటి విడివిడిగా స్వరూపాలున్నాయి. అన్ని కలిస్తేనే మహాశక్తి అయిందన్నారు.

దివ్యరూపిణీ.. పాపహారిణీ

- వైభవంగా దేవి నవరాత్రులు
- దుర్గాదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు


గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం, అరండల్‌పేట అష్టలక్ష్మి ఆలయంలో దుర్గాదేవి అలంకారం

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): భక్తులను కరుణించే జగన్మాత శరన్నవరాత్రి ఉత్సవాలు కనుల పండువగా సాగుతున్నాయి. మంగళవారం అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలు, అలంకరణలు జరిగాయి. గో పూజ, సువాసిని, కుమారి పూజలు, సువాసినులచే సామూహిక కుంకుమార్చనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పలు దేవాలయాల్లో అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించారు. సామూహిక తులసి పూజలు, మహావిద్య హోమం, సహస్ర నామార్చనలు నిర్వహించారు.


శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శ్రీ కాళికాదేవి, చుట్టుగుంట పోలేరమ్మ తల్లి ఆలయంలో శ్రీదుర్గా దేవి అలంకారాలు

● గుంటూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): శ్రీ దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు నగరంలో వైభవంగా జరుగుతున్నాయి. నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఏటుకూరు రోడ్డులోని శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శ్రీ కాళికాదేవిగా, సంగడిగుంట రెడ్లబజారులోనున్న శ్రీకనకదుర్గమ్మ ఆలయంలో, చుట్టుగుంట పోలేరమ్మ తల్లి ఆలయంలో శ్రీ దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కోర్టురోడ్డులోనున్న వీర్ల అంకమ్మతల్లి ఆలయంలో శ్రీ దుర్గాదేవి అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. అలానే ఏటుకూరు రోడ్డులోని శ్రీ కన్యకా పరమేశ్వరి ఎన్‌క్లేవ్‌లో టీఎల్‌వీ వీరాంజనేయులు ఆధ్వర్యంలో అమ్మవారు శ్రీ దుర్గాదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. అలానే మహిళా ముత్తయిదువలతో పెద్ద ఎత్తున కుంకుమపూజలు నిర్వహించారు.


వెలగపూడి లే అవుట్లో తీసిన గుంతలో నిలిచిన నీరు

రాజధాని లే అవుట్లు ఇలాగేనా!

● ఏడాదిన్నరపాటు ప్లాట్లు ఇవ్వకుండా ఏం చేస్తున్నారు?

- రాజధాని రైతుల్లో పొడ చూపుతున్న ఆగ్రహం
- హడావిడిగా దిద్దుబాటు చర్యలకు దిగిన సీఆర్డీఏ
- వర్షాల్లో, బురదలో లే అవుట్లలో పనులకు శ్రీకారం
- వాహనాల తొక్కిడితో లే అవుట్లలో భూమి ఛిద్రం
- బెడిసి కొడుతున్న దిద్దుబాటు చర్యలు

గుంటూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాజధాని కోసం భూములిచ్చిన రైతులకు ఇచ్చే రిటర్నబుల్ ప్లాట్ల లే అవుట్ల విషయంలో కొత్త సమస్య తలెత్తింది. కూటమి ప్రభుత్వం వచ్చి 15 నెలలైనా తమకు ప్లాట్లు సిద్ధం చేసి ఇవ్వలేదని భూములిచ్చిన రైతులు ఒక్కొక్కరుగా రోడ్డు మీదకు ఎక్కుతుండడంతో దిద్దుబాటు చర్యల్లో భాగంగా హడావుడిగా లే అవుట్లు సిద్ధం చేయడానికి అధికారులు కుస్తీలు పడుతున్నారు. అయితే లే అవుట్లలో చేపడుతున్న పనుల తీరుపై రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. దాంతో లే అవుట్ల వ్యవహారం పీటముడిలా మారుతోంది.

ఏడాదిన్నరపాటు మీనమేషాలు లెక్కబెట్టారా?

రాజధాని కోసం తాము భూములు త్యాగం చేసి 11 ఏళ్లవుతున్నా ఇంత వరకూ తమకు రిటర్నబుల్ ప్లాట్లు ఇవ్వకపోవడమేంటని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 2014-19కి ముందే తమకు ఇవ్వాల్సిన ప్లాట్లు ఇచ్చి ఉంటే గత వైసీపీ ప్రభుత్వం తమను వేదనకు గురిచేసేది కాదని రైతులు వాపోతున్నారు. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకైనా తమకు ప్లాట్లు వస్తాయని ఆశిస్తే అది ఇప్పటి వరకు నెరవేరలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో పలువురు రైతులు సామాజిక మాధ్యమాల వేదికగా ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నారు. దీంతో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించింది. అయితే సీఆర్డీఏ అధికారుల నిర్వాకంతో వ్యవహారం మొత్తం బెడిసి కొడుతోంది.

● హడావుడిగా పనులు.. గుల్లవుతున్న నేల

కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా తమకు ప్లాట్లు రాకపోవడంతో రైతులు అసహనం వ్యక్తం చేస్తున్న విషయం సాక్షాత్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి వెళ్లింది. దీంతో ఇటీవల జరిగిన సమావేశంలో ఆయన దీనిపై తక్షణ చర్యలు చేపట్టాలని పురపాలకశాఖ, సీఆర్డీఏకు సూచించారు. దీంతో సీఆర్డీఏ హడావుడిగా వెలగపూడి, లింగాయపాలెం గ్రామాల్లోని లే అవుట్లలో పనులు ప్రారంభించింది. అయితే ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల మధ్య భారీ ప్రొక్లెయినర్లతో దిగి కంప చెట్ల తొలగింపుతోపాటు, లే అవుట్లలో అంతర్గత రోడ్లు వేసేందుకు మట్టి తొలగింపు కార్యక్రమం చేపట్టారు. వర్షాల్లో ఈ పనులు చేపట్టడం కారణంగా లే అవుట్లలో మొత్తం నేలంతా గుల్లయిపోతోంది. రోడ్డు వేయడం కోసం రెండడుగుల మేర గుంతలు తీశారు. ఈ గుంతల్లో ఒక పొర కంకర, మరో పొర గులకరాయి వేసి, ఆ తరువాత రోడ్డు వేయాల్సి ఉంటుంది. అయితే ఈ గుంతలు వర్షాకాలంలో తీయడంతో వాటిలో నీరు చేరింది. దీంతో మళ్లీ నీళ్లు తోడుకోవడం పనిగా మారింది. ఇలా అర్థరహితంగా చేపడుతున్న పనుల కారణంగా లే అవుట్లు దెబ్బతినడమే కాకుండా, ప్రభుత్వంపై కూడా భారం పడుతోంది.

● ఈ దఫా అయినా వచ్చేనా..!

ఇదిలా ఉంటే రాజధాని రైతులకు ప్లాట్లు ఇవ్వడంలో జరుగుతున్న జాప్యం రైతుల్లో భయాందోళనలకు దారితీస్తోంది. ఈ దఫా అయినా తమకు ప్లాట్లు ఇస్తారో లేదోనని వారు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. తమకు ప్లాట్లు సకాలంలో ఇచ్చి ఉంటే రాజధానిలో ప్రభుత్వ భవనాలతోపాటు, ప్రైవేటు భవనాల నిర్మాణం కూడా సమాంతరంగా సాగుతుందని, అది రాజధాని సర్వతోముఖాభివృద్ధికి ఎంతో దోహదం చేస్తుందని అంటున్నారు. ఇకనైనా ప్రభుత్వం ప్లాట్లను సరైన రీతిలో సిద్ధం చేసి తమకు అందజేయాలని రైతులు కోరుతున్నారు.



బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో..

- ఘనంగా బతుకమ్మ వేడుకలు
- తెలంగాణ సరిహద్దు మండలాల్లో కోలాహలం

దాచేపల్లి/దుర్గి సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాలు విడిపోయినా ప్రజల మధ్య ఉన్న ఆచారాలు, సాంప్రదాయాలు కొనసాగుతూనే ఉన్నాయి. ముఖ్యంగా బతుకమ్మ అంటే గుర్తు వచ్చేది తెలంగాణ రాష్ట్రం. తెలంగాణకు సరిహద్దు మండలం దాచేపల్లిలో బతుకమ్మ వేడుకలు వైభవంగా జరుగుతుంటాయి. మహిళలు బతుకమ్మను తమ ఇంటి ఆడపడుచుగా భావించి ప్రత్యేక పూజలు చేస్తుంటారు. తెలంగాణకు చెందిన ఆడ పిల్లలను ఈ ప్రాంత వాసులకు ఇచ్చి పుచ్చుకోవడం సంవత్సరాల తరబడి జరుగుతుంది.అప్పటి నుంచే ఈ ప్రాంతంలో బతుకమ్మను దేవీ నవరాత్రుల్లో భాగంగా చేసి పూజలు చేస్తారు.

ఏడు కోటలతో వెంపలి చెట్టుకు

పుట్ట మన్నుతో నాగ పడిగ ఆకారంలో ఏడు కోటలను నిర్మించి అందులో వెంపలి చెట్టును ఉంచుతారు. తొమ్మిది రోజుల పాటు అమ్మవారికి రోజుకొక పిండి వంటలను తయారు చేసి నివేదన చేస్తారు. పెళ్లికాని ఆడ పిల్లలు, సంతానం లేని వారు, సౌభాగ్యం కోరుకొనే మహిళలు అమ్మవారికి ఈ పది రోజుల పాటు పూజలు చేసి తమ మొక్కులు చెల్లించుకుంటారు. వాడవాడలా చిన్నారులు బతుకమ్మను ఏర్పాటు చేసుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. దసరా పండుగ రోజు పది రోజుల పాటు పూజలందుకున్న బతుకమ్మను గ్రామానికి సమీపంలో ఉన్న వాగులు, చెరువులు, కుంటలో నిమజ్జనం చేస్తారు. ఈ నిమజ్జన కార్యక్రమానికి మహిళలంతా పెళ్ళి కుమార్తెను అత్తవారింటికి పంపించేటప్పుడు సారె ఇచ్చినట్లు.. చీర, చలిపిండి, పూలు, గాజులు, పండ్లు బతుకమ్మకు అందజేసి తమ కోర్కెలు తీర్చమని వేడుకుంటారు. ఈ పది రోజుల పాటు ఈ ప్రాంతంలో కోలాహలంగా ఉంటుంది. మహిళలంతా ఒక యూనిట్‌గా ఏర్పడి వీధుల్లోనే బతుకమ్మను ఏర్పాటు చేసి పూజలు చేస్తారు. మగవారు ఈ పూజా కార్యక్రమాలకు తమ వంతుగా సహకరించి అమ్మవారికి కృపకు పాత్రులవుతుంటారు. తెలంగాణ పద్ధతిలోనే బతకమ్మను పలురకాల పూలతో అలంకరించి పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది.

పల్లె పల్లెన బతుకమ్మ సంబరాలు..

దసరా పండుగ వచ్చింది.. వస్తూనే బతుకమ్మ సంబరాలను తెచ్చింది. నిన్నా మొన్నటి వరకు పట్టణాలకే పరిమితమైన బతుకమ్మ ప్రస్తుతం పల్లెలోనూ సందడి చేస్తోంది. మండల కేంద్రమైన దుర్గితోపాటు ఓబులేశునిపల్లె, అడిగొప్పుల, ముటుకూరు, ధర్మవరం వంటి పల్లెల్లో బతుకమ్మ ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. మహిళలు వివిధ రకాల పూలతో ఆకర్షణీయంగా బతుకమ్మలను చేసి ఊరేగిస్తున్నారు. చిన్నారులు, యువతులు కోలాటాలు చేస్తూ ఆకట్టుకుంటున్నారు. వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆధ్యాత్మికం, సాంప్రదాయ మేళవింపుగా దుర్గి మండల పరిధిలో బతుకమ్మ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. బతుకమ్మలను పురవీధుల్లో ఊరేగించి దేవాలయాల్లో కొలువుదీరుస్తున్నారు. దేవీ శరన్నవరాత్రులు ముగింపు రోజున బతుకమ్మలను కుడికాలవలో వదలనున్నారు. చిన్నా పెద్ద తేడా లేకుండా గ్రామస్థులు ఐకమత్యంతో బతుకమ్మ ఊరేగింపులో పాల్గొంటూ తమ భక్తిని చాటుకుంటున్నారు.


దుర్గిలో బతుకమ్మ ఊరేగింపు ముందు చిన్నారుల కోలాటం

పంచాయతీల్లో అక్రమాలకు చెక్..!

- దొంగబిల్లులతో ఖజానా ఖాళీకి అడ్డుకట్టు
- స్వర్ణ పంచాయతీ యాప్ ద్వారా పాలన కొనసాగింపు

వినుకొండటౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో అక్రమాలకు చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా పంచాయతీలకు వచ్చే నిధులు, ప్రజలు చెల్లించే పన్నులతో పాటు ప్రతి పైసాకు జమా ఖర్చులు పారదర్శకంగా ఉండేలా ప్రభుత్వం సాంకేతికతను ఉపయోగిస్తోంది. పంచాయతీ పాలన పారదర్శకంగా ఉండేందుకు నూతనంగా స్వర్ణ పంచాయతీ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. నిధుల వినియోగంలో అక్రమాలను అరికట్టేందుకు వీలుగా కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వర్ణ పంచాయతీ యాప్ సత్ఫలితాలను ఇస్తుంది. ఇక నుంచి స్వర్ణ పంచాయతీ యాప్ ద్వారానే ఆర్థిక లావాదేవీలు, జమా ఖర్చులు కొనసాగించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా 13,344 గ్రామపంచాయతీల్లో ఈ యాప్ ద్వారా పారదర్శక పాలన అందించేందుకు సన్నాహాలు ప్రారంభించింది. పల్లెల్లో ప్రజలు నివాస గృహాల, ఇతర గృహాల, తాగునీటి పన్నులను సరిగా చెల్లించేవారు కాదు. చెల్లించిన నగదుకు లెక్కలు ఉండేవి కాదు. అందిన కాడికి దోచుకునేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అక్రమాలను అరికట్టేందుకు చర్యలు చేపట్టింది. గుండుసూది మొదలుకొని పొరకల కొనుగోలు వరకు జమా ఖర్చులకు ప్రతిపైసా పారదర్శకంగా ఉండేలా స్వర్ణపంచాయతీ విధానం తీసుకొచ్చింది.



● 'స్వర్ణ పంచాయతీ'తో ఉపయోగాలు

స్వర్ణ పంచాయతీ యాప్ అందుబాటులోకి వస్తే ప్రజలు కార్యాలయాలకు వెళ్లాల్సిన పని లేకుండా పన్నులన్నీ డిజిటల్ రూపంలో చెల్లించవచ్చు. ఇంటి పన్నుల చెల్లింపులు, బాకీలను డిజిటల్ రూపంలో చెల్లించవచ్చు. డబ్బు నేరుగా పంచాయతీ ఖాతాల్లోకి జమవుతుంది. అలాగే పంచాయతీలు ఖర్చు చేసే ప్రతిపైసా వివరాలు పారదర్శకంగా ఉంటాయి. ఈ యాప్ అందుబాటులోకి వస్తే కార్యదర్శులు లెక్కలు చెప్పాల్సిందే. కొనుగోళ్లను యాప్ ద్వారా నమోదు చేయాలి. దొంగబిల్లుల చెల్లింపులు అరికట్టవచ్చు. ప్రతి లావాదేవీ ఆన్‌లైన్‌లో నమోదు కావడం వల్ల పారదర్శకత పెరుగుతుంది. గ్రామీణ ప్రజలు ఇంటి నుంచి సేవలు పొందవచ్చు. రశీదు, లావాదేవీల వివరాలు ఎప్పుడైన చూసుకోవచ్చు. స్వర్ణ పంచాయతీ యాప్ డిజిటల్ రికార్డులను సులభతరం చేస్తుంది.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

విడాకులు ఇచ్చేశారు



ప్రముఖ తమిళ సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్‌కుమార్, ఆయన సతీమణి, నేపథ్యగాయని సైంధవి చట్టబద్ధంగా విడిపోయారు. వీరికి చెన్నై ఫ్యామిలీ కోర్టు మంగళవారం విడాకులు మంజూరు చేసింది. 2013లో వివాహం చేసుకున్న వీరికి అన్వీ అనే కుమార్తె ఉంది. మనస్పర్థల కారణంగా గత యేడాది విడిపోతున్నట్టు ప్రకటించి, విడాకుల కోసం కోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో చివరగా ఈ నెల 25వ తేదీన విచారణ జరగ్గా, జీవీ ప్రకాశ్, సైంధవి కోర్టుకు హాజరై విడిపోయేందుకు సమ్మతం తెలిపారు. అదే సమయంలో తన కుమార్తె సంరక్షణ బాధ్యతలను సైంధవి స్వీకరించడానికి తనకెలాంటి అభ్యంతరం లేదని జీవీ ప్రకాశ్ న్యాయమూర్తికి తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ కేసు తుది తీర్పును మంగళవారం కోర్టు వెలువరించింది. జీవీ ప్రకాశ్ - సైంధవి దంపతులకు విడాకులు మంజూరు చేస్తూ, కుమార్తె సంరక్షణా బాధ్యతలను సైంధవికి అప్పగిస్తున్నట్లు ప్రకటించింది.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

కౌబాయ్‌గా మళ్లీ వస్తున్న మెగాస్టార్



మెగాస్టార్ చిరంజీవి నటించిన ఏకైక కౌబాయ్ చిత్రం 'కొదమసింహం'. చిరంజీవి, శ్రీదేవి జంటగా నటించిన సూపర్ హిట్ చిత్రం 'జగదేకవీరుడు-అతిలోకసుందరి' విడుదలైన సరిగ్గా మూడు నెలలకు అంటే 1990 ఆగస్టు 9న కొదమసింహం విడుదలైంది. ఆ సమయంలో వస్తున్న చిత్రాలకు భిన్నంగా ఉండడంతో ప్రేక్షకులు ఈ సినిమాను బాగా ఆదరించారు. కైకాల సత్యనారాయణ సమర్పణలో ఆయన సోదరుడు నాగేశ్వరరావు నిర్మించిన 'కొదమసింహం' చిత్రానికి మురళీమోహనరావు దర్శకుడు. ఈ సినిమాలో చిరంజీవి సరసన రాధ, సోనమ్, వాణీవిశ్వనాథ్ నటించారు. మోహన్‌బాబు పోషించిన కామెడీ విలన్ పాత్ర 'సుడిగాలి' ఈ చిత్రానికి మరో ఆకర్షణ. 'కొదమసింహం' చిత్రాన్ని 4కెలోకి మార్చి, 5.1 డిజిటల్ సౌండింగ్ వంటి అదనపు హంగులు చేకూర్చి నవంబర్ 21న మళ్లీ విడుదల చేయనున్నారు. విజయదశమి సందర్భంగా చిత్ర నిర్మాత నాగేశ్వరరావు ఈ విషయాన్ని వెల్లడించారు. సంగీత దర్శకత్వ ద్వయం రాజ్-కోటి స్వరపరిచిన పాటలు ఈ చిత్రానికి మరో హైలైట్.

శుక్రాచార్యుడిగా అక్షయ్ ఖన్నా



ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ నుంచి వచ్చిన తొలి పాన్ ఇండియా చిత్రం 'హనుమాన్' బ్లాక్ బస్టర్ హిట్ కొట్టిన విషయం తెలిసిందే. దీనికి సీక్వెల్‌గా 'జై హనుమాన్' రూపుదిద్దుకుంటోంది. ఈ యూనివర్స్‌లో వస్తోన్న మూడో ప్రాజెక్టు 'మహాకాళి'. దీనికి ప్రశాంత్ వర్మ కథను సమకూర్చగా, పూజ అపర్ణ కొల్లూరు తెరకెక్కిస్తున్నారు. ఆర్కేడీ స్టూడియోస్ బేనర్‌పై రివాజ్ రమేశ్ దుగ్గల్ నిర్మిస్తున్నారు. హిందీ చిత్రం 'ఛావా'లో ఔరంగజేబు పాత్రను అద్భుతంగా పోషించిన అక్షయ్ ఖన్నా 'మహాకాళి'లో అసురుల గురువు శుక్రాచార్యుడిగా కనిపించనున్నారు. ఇది ఆయనకు తెలుగులో తొలి చిత్రం. తాజాగా అక్షయ్ పాత్రను పరిచయం చేస్తూ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఒక భారీ కోట ముందు నిలబడి ఉన్నట్లు ప్రజెంట్ చేసిన తీరు ఆకట్టుకుంటోంది. కాగా, ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇప్పటికే 50 శాతం చిత్రీకరణ పూర్తయినట్లు చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సురేశ్ రగుతు, సంగీతం: స్మరణ్ సాయి.

ఉత్కంఠకు గురిచేసే ఆర్యన్



విష్ణు విశాల్, శ్రద్ధా శ్రీనాథ్ జంటగా ప్రవీణ్ కె తెరకెక్కించిన పరిశోధనాత్మక ఉత్కంఠ భరిత చిత్రం 'ఆర్యన్'. శుభ్ర, ఆర్యన్ రమేశ్, విష్ణు విశాల్ నిర్మాతలు. ఈనెల 31న తమిళం, తెలుగు భాషల్లో విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ టీజర్‌ని విడుదల చేశారు. ఓ హత్య కేసును దర్యాప్తు చేస్తోన్న విష్ణు విశాల్ పాత్రను టీజర్‌లో ఆసక్తికరంగా పరిచయం చేశారు. తనదైన శైలిలో, విభిన్నమైన నటనతో విశాల్ ఆకట్టుకున్నారు. 'రాట్ససన్' విజయం తర్వాత విష్ణు విశాల్ మరోసారి 'ఆర్యన్'లో పోలీస్ అధికారి పాత్రను పోషిస్తున్నారు.

సవాళ్లకు సిద్ధమే

సవాళ్లకు తానెప్పుడూ సిద్ధమే అంటున్నారు బాలీవుడ్ అగ్ర కథానాయిక దీపికా పదుకొనే. ఐఎండీబీ తాజాగా పాతికేళ్ల భారతీయ సినిమా (2000-2025) జాబితాను విడుదల చేసింది. అందులో అత్యంత ప్రజాదరణ పొందిన నటీనటుల్లో దీపికా పదుకొనే నాలుగో స్థానంలో నిలిచారు. ఈ జాబితాలో స్థానం దక్కడంపై దీపిక మాట్లాడుతూ 'కెరీర్ ఆరంభం నుంచే సినీరంగంలో మహిళలు ఎలా నడుచుకోవాలో తరచూ నాకు చెప్పేవారు, అయితే అలాంటి మూస ధోరణిని సవాల్ చేయాలని నేను అప్పుడే నిర్ణయించుకున్నాను. ఏదైనా నచ్చకపోతే వెంటనే ప్రశ్నించేదాన్ని. మహిళలు అణిగిమణిగి ఉండాలన్నట్లు ప్రవర్తించే ధోరణిని ఎదుర్కోవడం వల్ల ఇబ్బందులు పడాల్సి వస్తుందని నాకు తెలుసు. అయినా నేను వెనుకాడలేదు. నా కుటుంబం, అభిమానులు, సహచరులు నాకు అండగా నిలిచారు. ఎన్ని ఒత్తిళ్లు ఎదురైనా నాకు నచ్చినట్లు ఉండగలిగే శక్తిని, ధైర్యాన్నిచ్చారు. చివరకు నా నమ్మకం నిజమైంది. నా తర్వాతి తరం కథానాయికలకు ఒక కొత్తదారిని వేయగలిగాననే సంతృప్తి నాకు ఉంది' అని చెప్పారు. ప్రభాస్ కథానాయకుడిగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వం వహిస్తున్న 'స్పిరిట్' చిత్రం నుంచీ, అలాగే నాగ్ అశ్విన్ 'కల్కి 2898 ఏడీ' సీక్వెల్ నుంచి ఆమె వైదొలగారు. 8 గంటల పని నిబంధనకు మేకర్స్ అంగీకరించకపోవడంతో ఆమె ఆ సినిమాల నుంచి వైదొలగారనే ప్రచారం జరిగింది. ఆ సమయంలో చెలరేగిన వివాదంపై దీపిక ఇలా పరోక్షంగా స్పందించారని బాలీవుడ్ విశ్లేషకులు అంటున్నారు.



రెండొందల కథలు విని.. ఓకే చేశారు



కన్నడ చిత్ర కథానాయకుడు శ్రీమురళి కొత్త చిత్రం 'పరాక్' మంగళవారం బెంగళూరులో మొదలైంది. అక్కడి బండి మహాకాళి ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమంలో చన్నగిరి శాసన సభ్యుడు శివగంగ బసవరాజు తొలి క్లాప్ ఇచ్చి షూటింగ్‌కు శ్రీకారం చుట్టారు. హలేశ్ కోగుండి ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. 'ఇది ఒక వింటేజ్ స్టైల్ సినిమా. దాదాపు రెండొందల కథలు విని ఈ కథ ఓకే చేశాను. రెగ్యులర్ షూటింగ్ ఈ నెలలోనే ప్రారంభమవుతుంది' అని శ్రీమురళి చెప్పారు. బ్రాండ్ స్టూడియోస్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రానికి చరణ్‌రాజ్ సంగీత దర్శకుడు.

జాంబీ నేపథ్యంలో రణ్‌వీర్ చిత్రం

బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్ జాంబీ నేపథ్యంలో కొత్త సినిమా చేయబోతున్నారు. ఈ చిత్రానికి జై మెహతా దర్శకత్వం వహించనున్నారు. అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్ బేనర్‌పై రూపుదిద్దుకోనున్న ఈ చిత్రానికి 'ప్రళయ్' అనేది వర్కింగ్ టైటిల్. రణ్‌వీర్ సింగ్ ప్రస్తుతం 'డాన్-3' షూటింగ్‌తో బిజీగా ఉన్నారు. ఇది పూర్తవడానికి మరో ఆరు నెలలు పడుతుంది. వచ్చే ఏడాది ద్వితీయార్థంలో ఈ ప్రాజెక్టు పట్టాలెక్కనుందని, ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జోరుగా సాగుతున్నాయని బాలీవుడ్ మీడియా కథనం. మరో వైపు రణ్‌వీర్ సింగ్ సరసన నటించబోయే స్టార్ కథానాయిక కోసం చిత్రబృందం అన్వేషిస్తోంది.



పశ్చిమ డెల్టాకు 7026 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టాకు 7026 క్యూసెక్కులనీరు మంగళవారం విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం బ్యారేజి వద్ద 16అడుగుల నీటిమట్టం ఉండగా దిగువకు 6,68,981 క్యూసెక్కు లనీరు విడుదల చేస్తున్నారు. దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి హైలెవెల్ ఛానల్‌కు 306 క్యూసెక్కులనీరు రేపల్లెకాల్వకు 1791, తూర్పుకాల్వకు 590, పశ్చిమకాల్వకు 230, నిజాం పట్నం కాల్వకు 390, కొమ్మమూరు కాల్వకు 3100 క్యూసెక్కుల నీరు, విడుదల చేస్తున్నారు.

రాష్ట్ర కనీస వేతనాల సలహామండలి డైరెక్టర్‌గా తాళ్ల అశోక్



దుగ్గిరాల, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పేరుకలపూడి ఎంపీటీసీ సభ్యుడు తాళ్ల అశోక్‌కుమార్ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్‌గా నియ మించారు. మండల ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్న అశోక్‌కు పదవి లభించడం పై మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, మాజీ ఎంపీపీ వెనిగళ్ళ శ్రీకృష్ణప్రసాద్, గోగం సుబ్బారావు, పలువురు టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

అలరించిన సత్యహరిశ్చంద్ర నాటకం

మంగళగిరి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మంగళగిరి మండలం చినకాకాని గ్రామంలోని పార్కు సెంటర్లో మంగళవారం రాత్రి ప్రదర్శించిన నాటకాలు అలరించాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవిత విశ్లేషణ, కవికోకిల గుర్రం జాషువా జీవిత చరిత్ర, సత్యహరిశ్చంద్ర పౌరాణిక నాటకాలను ఏర్పాటు చేశారు. ఏపీ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఆత్మకూరు గ్రామానికి చెందిన శ్రీ జయంతి నాట్య మండలి సంఘం ఆధ్వర్యంలో ఈ నాటకాలను ప్రదర్శించారు.

పౌరహక్కుల దినోత్సవం

ప్రత్తిపాడు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులోని ఈడీపీవో కార్యాలయం ఎదుట తహసీల్దార్ సుజాత ఆధ్వర్యంలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. సందర్భంగా తహసీల్దార్ సుజాత సమాజంలో పౌరుల హక్కులకు ఎలాంటి విఘాతం కలగకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ రహమాన్, ఆర్‌ఐ దినకర్, వీఆర్వోలు షఫి, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

పాము కాటుతో వ్యక్తి మృతి

స్థానిక నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని సుందరయ్య కాలనీకి చెందిన షేక్ జానీ పాముకాటుతో మృతి చెందాడు. జానీ నాలుగేళ్లుగా సుందరయ్య కాలనీలో ఉంటున్నారు. జానకి 16 ఏళ్ల క్రితం ఆనందపేటకు చెందిన నూరీతో వివాహమైంది. సెప్టెంబరు 28 రాత్రి 10 గంటలకు ఇంటిలో నిద్రపోతుండగా కుడికాలుపై కాటు వేసింది. జానీ సోదరుడు సుభాని వెంటనే జీజీహెచ్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ జానీ మృతి చెందాడు ఆయన సోదరుడు సుభాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దుర్గాదేవిగా అమ్మవారు



మంగళగిరి ఎర్రచెరువు వద్ద దుర్గాదేవీ అలంకారంలో కాళీమాత

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భగంగా దుర్గాష్టమి రోజైన మంగళవారం పలు ఆలయాల్లో అమ్మవారు శ్రీదుర్గాదేవిగా భక్తులచే పూజలందుకున్నారు. పాత మంగళగిరి దుర్గానగర్‌లో కొలువైన శ్రీ కనకదుర్గమ్మ, ఎర్రచెరువు వద్ద శ్రీకాళీమాత, స్టేషన్ రోడ్డులో శ్రీఅఖిలాండేశ్వరీ అమ్మవారు, మెయిన్ బజారులో శ్రీకన్యకాపరమేశ్వరీ అమ్మవారు, మహాదుర్గాదేవిగా దర్శనమిచ్చారు. శ్రీలక్ష్మీనృసింహ స్వామి దేవస్థానంలో శ్రీరాజ్యలక్ష్మీ అమ్మవారు, ఘాట్ రోడ్డులో శ్రీపద్మావతి అమ్మవారు ధైర్యలక్ష్మీ అలంకారంలో భక్తులను అనుగ్రహించారు. దుగ్గిరాల మండలంలోని పలుగ్రామాల్లో ఆలయాల్లో అమ్మవారు శ్రీదుర్గా దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్తిపాడులోని సుప్రసిద్ధ దండేశ్వరాలయం, వేణుగోపాలస్వామి దేవాలయాల్లో అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు అమ్మవారు దర్శనమిచ్చారు. పెదనందిపాడు మండలపరిధిలోని పాలపర్రులో రేణుకాంబ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో దర్శనమిచ్చింది.



శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ధైర్యలక్ష్మీగా రాజ్యలక్ష్మీ అమ్మవారు



శ్రీదుర్గాదేవి అలంకారంలో కేఆర్‌కొండూరు అమ్మవారు



దుగ్గిరాల శివాలయంలో శ్రీదుర్గాదేవిగా పార్వతీ అమ్మవారు



ప్రత్తిపాడు దండేశ్వరాలయంలో దుర్గాదేవిగా అమ్మవారు



ఫిరంగిపురంలో దుర్గాదేవిగా శ్రీ మూలాంకురేశ్వరి దేవి



పెదనందిపాడులో దుర్గాదేవిగా అమ్మవారు

పెళ్లికానుక అందజేత



పెళ్లికానుక అందజేస్తున్న టీడీపీ నేతలు

తాడేపల్లి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండిమెడ గ్రామానికి చెందిన నామతోటి రామారావు, సుగుణకుమారిల కుమార్తె వివాహ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ పంపిన పట్టు వస్త్రాలను, పెళ్లి కుమార్తెకు మంగళవారం స్థానిక టీడీపీ నేతలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు చిగురుపాటి సుబ్బారావు, నామతోటి రాంబాబు స్థానికులు పాల్గొన్నారు.

జీఎస్టీపై నేడు అవగాహనా ర్యాలీ

పెదనందిపాడు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గుదలపై బుధవారం ట్రాక్టర్ల ర్యాలీతో అవగాహనా ర్యాలీ నిర్వహించనున్నట్లు ఏవో ఐ సుబ్రహ్మణ్యం మంగళవారం తెలిపారు. ఈ ర్యాలీలో పెద్దసంఖ్యలో రైతులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నీట మునిగిన పొలాలను పరిశీలించిన రైతు సంఘాలు

దుగ్గిరాల, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణానది కర కట్ట అంచునగల గ్రామాల్లో వరదనీట మునిగిన పంటలను రైతుసంఘా లు, కౌలురైతుసంఘాల నాయకులు మంగళవారం పరిశీలించారు. రెండ్రోజు లుగా కృష్ణానది వరదతీవ్రత పెరుగుతుండటంతో వీర్లపాలెం, గొడవర్రు, పెదకొండూరు గ్రామాల్లో పొలాలు ముంపులో ఉన్న విషయం విదితమే. పెదకొండూరు వద్ద నీటమునిగి పంటపొలాలను పరిశీలించిన కౌలు రైతు సంఘ జిల్లా నాయకులు ఈమని అప్పారావు మాట్లాడుతూ మినుము పూర్తిగా దెబ్బతిని పోయిందని, పంట కోసం ఇప్పటివరకూ పెట్టిన పెట్టు బడి నీటిపాలైందని, నష్టపోయిన రైతులకు, ఎకరాకు రూ.10వేలు అందిం చాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ప్రకాశం బ్యారేజి నుంచి 6లక్షల68వేల981 క్యూసెక్కులనీరు విడుదల చేస్తున్నారు. మూడ్రోజులగా వరద ఉధృతితో వందలాది ఎకరాల వాణిజ్యపంటలు, కూరగాయ తోటలు నీటిముంపులోనే ఉండిపోయాయి.

ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

తాడేపల్లి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేసి ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని ఆలిండియా మోటారు వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నన్నపనేని శివాజి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఎంటీఎంసీ పరిధిలోని కుంచనపల్లి డీమార్ట్ వద్ద ఆటో కార్మికుల సమావేశం సీఐటీయూ మండల కార్యదర్శి పల్లె కృష్ణ అధ్యక్షతన జరిగింది. శివాజి మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఈ నేపథ్యంలో ఆటో కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. వాహన మిత్ర పథకం కింద ఆటో డ్రైవర్లకు రూ.15వేలు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని, వాహన మిత్ర డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న ప్రతి డ్రైవర్‌కు రూ.25వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాగా ఆటో డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడిగా శేఖర్‌బాబు, ఉపాధ్యక్షుడిగా బి.శివ, కార్యదర్శిగా టి.ప్రవీణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా జోషి, కోశాధికారిగా మధుబాబులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం మండల కార్యదర్శి కాజ వెంకటేశ్వరరావు, ఆటో డ్రైవర్లు సుశీలరావు, దాసు, కోటి మరియబాబు, జోసఫ్, తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీపై ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ అవగాహన ర్యాలీ



తుళ్లూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, కూటమి నాయకులు

తుళ్లూరు సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ 2.0పై ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ మంగళవారం తుళ్లూరులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పేదలకు జీఎస్టీ తగ్గింపు ఎంతగానో ప్రయోజనం కలిగిస్తుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నారు. ఆంజనేయస్వామి గుడి నుంచి ర్యాలీ ప్రారంభించిన ఎమ్మెల్యే పలు దుకాణాలను సందర్శించి వ్యాపారులతో జీఎస్టీ గురించి మాట్లాడారు. అనంతరం హెచ్‌ఎస్ ఆర్ కల్యాణ మండపంలో వ్యాపారులు, గ్రామస్థులతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. కార్యక్రమంలో కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి బీమా చెక్కు అందజేత



శంబ్రావ్ కుటుంబానికి చెక్కును అందజేస్తున్న టీడీపీ నేతలు

మంగళగిరి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన టీడీపీ కార్యకర్త కుటుంబానికి పార్టీ తరపున మంగళవారం బీమా చెక్కును అందజేశారు. మంగళగిరి పట్టణంలో 3వ వార్డుకు చెందిన టీడీపీ కార్యకర్త గండాలు శంబ్రావ్ రోడ్డు ప్రమాదంలో మరణించాడు. శంబ్రావ్ కుటుంబానికి టీడీపీ సభ్యత్వ ఇన్సూరెన్స్ సొమ్ము రూ.5 లక్షల చెక్కును స్థానిక నేతలు మృతుడి భార్య సాయి సింధూజకు అందించారు. ఈ సందర్భంగా సింధూజ మాట్లాడుతూ కష్టకాలంలో తమ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకున్నందుకు సీఎం చంద్రబాబుకు, మంత్రి నారా లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పడవల మహేష్, షేక్ రియాజ్, 3వ వార్డు అధ్యక్షుడు యుద్ధం అప్పారావు, నేతలు ఏడుకొండలు, వంగర హనుమాన్, శాంబ్రావు మహిమ, బాలాజీ, రంగిశెట్టి నరేంద్ర, ఉమా, నీలం రాము, పంచల సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కొండవీడు కొండల్లో ఐదు వందల సీడ్ బాల్స్

ఫిరంగిపురం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఫిరంగిపురంలోని గ్రీన్ వారియర్స్ ఆధ్వర్యంలో కొండవీడు ఘాట్ రోడ్డు, కొండవీడు ప్రాంతంలో ఐదు వందల సీడ్‌బాల్స్‌ను ప్రకృతి పరిరక్షణ, పర్యావరణ హితం కోసం మంగళవారం వేశారు. ఈ సీడ్ బాల్స్‌లో మర్రి, చింత, తుమ్మ, సీతాఫలం లాంటి పలు విత్తనాలతో తయారు చేసి వెదజల్లారు. కార్యక్రమంలో అసిస్టెంట్ బీట్ అధికారి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



132 కిలోల నిషేధిత ప్లాస్టిక్ సీజ్

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలోని ఎస్‌వీపీ రోడ్డులో మంగళవారం పురపాలక సంఘం అధికారులు ఆకస్మిక తనిఖీలు చేసి అక్రమంగా నిల్వ ఉంచి విక్రయిస్తున్న నిషేధిత ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకున్నారు. తనిఖీలలో 132 కిలోల నిషేధిత ప్లాస్టిక్ సీజ్‌చేసి యజమానికి రూ.5వేలు జరిమానా విధించారు. నిషేధిత ప్లాస్టిక్ వినియోగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు హెచ్చరించారు. తనిఖీలలో శానిటరీ ఇనెస్పెక్టర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు



తెనాలి మారీసుపేట ఆలయంలో మహంకాళి అలంకారం, అష్టలక్ష్మి ఆలయంలో శ్రీచక్రానికి పసుపు కొమ్ముల పూజ, కొల్లిపర శ్రీజనార్ధనస్వామి ఆలయంలో, పొన్నూరు విశాలాక్షమ్మ, పెదకాకానిలో భ్రమరాంబ అమ్మవార్లకు దుర్గాదేవి అలంకారం

దుర్గాదేవిగా పూజలందుకున్న అమ్మవారు

నియోజకవర్గం అంతటా శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం అమ్మవారు దుర్గాదేవిగాను, మహాకాళి అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. బోసు రోడ్డులోని శ్రీవాసవీ ఆలయంలో అమ్మవారిని మహాదుర్గాగా అలంకరించారు. బీసీ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు, బీసీ సంఘ నాయకులు పూజల్లో పాల్గొన్నారు. మారీసుపేట శివాలయంలో దేవీచౌక్‌లో అమ్మవారిని మహాకాళిదేవిగా అలంకరించారు. కొత్తపేట అష్టలక్ష్మి ఆలయంలో అమ్మవారి శ్రీచక్రానికి పసుపు కొమ్ములతో పూజలు చేశారు. చంద్రబాబు కాలనీలో విజయదుర్గ ఆలయంలో సువాసిని పూజలు చేశారు. సుల్తానాబాద్‌లో మహంకాళి అలంకారంలో పూజలు జరిపారు.

● దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా పెదకాకాని మల్లేశ్వర స్వామి దేవస్థానంలో లోని భ్రమరాంబ అమ్మవారు మంగళవారం దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. - ఆంధ్రజ్యోతి

రూ.5.35 లక్షలు సీఎం సాయం అందజేత

తెనాలి అర్బన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గానికి చెందిన ఆరుగురి వైద్యసాయానికి రూ.5లక్షల 35 వేల 959ల సాయాన్ని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ మంగళవారం పంపిణీ చేశారు. నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో సీఎం సహాయ నిధి అందిన చెక్కులను వైద్య చికిత్స చేయించుకుంటున్న కుటుంబాలకు అందజేశారు. పార్టీ నాయకులు మహ్మద్ ఖుద్దూస్, జొన్నాదుల మహేష్, టి.హరిప్రసాద్, ఈదర వెంకటపూర్ణచంద్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం సహాయ నిధి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

కార్యకర్తల కుటుంబానికి అండగా టీడీపీ: ఎమ్మెల్యే నరేంద్రకుమార్

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. సోమవారం మృతి చెందిన టీడీపీ కార్యకర్తల కుటుంబాలకు ఎమ్మెల్యే నరేంద్ర కుమార్, మాజీ మంత్రి దేవినేని ఉమా బీమా పరిహారాన్ని అందజేశారు. మండల పరిధిలోని ఇటికంపాడుకు చెందిన ఇంటూరి దిల్దార్, పచ్చలతాడిపర్రు గ్రామానికి చెందిన మొవ్వ వెంకటేశ్వరరావు ప్రమాదవశాత్తు మరణించగా వారి కుటుంబాలకు ఐదు లక్షల బీమా పరిహార నగదును అందజేశారు.



రూ.5లక్షల బీమా పరిహారం చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్, మాజీ మంత్రి దేవినేని ఉమ

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

చేబ్రోలు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు మంగళవారం పంపిణీ చేశారు. రోగుల చికిత్స నిమిత్తం ప్రభుత్వం మంజూరు చేసిన రూ.11,14,729 విలువైన 17చెక్కులను నరేంద్రకుమార్ అందజేశారు.

విద్యార్థులకు సత్కారం

చేబ్రోలు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలంలోని గరువుపాలెంలో దుర్గాభవాని యూత్ ఆధ్వర్యంలో 30వ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పొన్నూరు ఎమ్మెల్యే నరేంద్రకుమార్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలోని జడ్పీ హైస్కూల్‌లో 2024-2025 విద్యా సంవత్సరంలో 10వతరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. రిటైర్డ్ హెడ్ మాస్టర్ అలహరి శివరామకృష్ణని ఎమ్మెల్యే నరేంద్రకుమార్ సన్మానించారు.



తెనాలిలోని సాయిగురుజీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దసరా ఉత్సవాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పూజల అనంతరం వారిని గురూజీ ఆశీర్వదించారు. - తెనాలి అర్బన్

అలరిస్తున్న నాటక ప్రదర్శనలు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ప్రదర్శిస్తున్న నాటకాలు ప్రేక్షకులను అలరిస్తున్నాయి. కళల కాణాచి ఆర్ఎస్ఆర్ గ్రీన్ వే ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వీణా అవార్డ్స్-2025లో మంగళవారం రెండు పద్యనాటకాలు, ఒక సాంఘిక నాటకం, ఒక నాటికను ప్రదర్శించారు. నేటి సమాజంలో కుటుంబ బంధాలు ఇతివృత్తంగా అందరూ మంచివారే కానీ నాటికను ప్రదర్శించారు. యడ్లపాడు మానవతా సంస్థ కళాకారులు ప్రదర్శించిన ఈ నాటికను జరుగుల రామారావు రచించి దర్శకత్వం వహించారు. గజదొంగ, వేశ్య మధ్య ప్రేమాయణం ఇతివృత్తంగా జగదేక సుందరి సామా పద్య నాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. కర్నూలు టీజీవీ కళాక్షేత్రం కళాకారులు ప్రదర్శించిన నాటకాన్ని కులశేఖర్ రచించగా గోగులయ్య దర్శకత్వం వహించారు. విజయవాడ అభ్యుదయ ఆర్ట్స్ కళాకారులు ప్రదర్శించిన క్రతువు సాంఘిక నాటికను సత్యనారాయణ రచించగా బి.రమేశ్ దర్శకత్వం వహించారు. మరో పద్య నాటకం మోహినీ భస్మాసురను విజయనగరం అక్కినేని సాంస్కృతిక సమాజం కళాకారులు ప్రదర్శించారు. పంచనాదం రచించిన ఈ నాటికకు సత్తిబాబు దర్శకత్వం వహించారు. కళల కాణాచి అధ్యక్షుడు సినీ రచయిత బుర్రా సాయిమాధవ్, ప్రధాన కార్యదర్శి గోపరాజు విజయ్, చెరుకుమల్లి సింగారావు, దేవరపల్లి భవానీ, కనపర్తి మధుకర్, హకీంజాని, అయినాల మల్లేశ్వరరావు, రమేశ్, సౌజన్య పర్యవేక్షించారు.

వీణ కళాకారులకు సన్మానం

తెనాలి అర్బన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): 108 వీణలతో సంగీతార్చన చేయించిన కళాకారులు కళ్యాణి హేమలత, వరప్రసాద్‌లను బాలస్వామి సత్కరించారు. గంగానమ్మపేట శ్రీవిద్యాపీఠంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో వారిని అభినందించారు.

కనీస వేతనాల సలహా సభ్యుడిగా సాంబశివరావు

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు ఆకుల సాంబశివరావు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి కార్పొరేషన్ సభ్యుడిగా నియమితులయ్యారు. మంగళవారం ప్రభుత్వం కార్పొరేషన్ సభ్యుల నియామకం ఉత్తర్వులు జారీ చేసింది.

వాట్సాప్ నుంచి వైదొలగిన సచివాలయ ఉద్యోగులు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): సచివాలయాల ఉద్యోగులు వాట్సాప్ ఆదేశాలను తీసుకునే విధానం నుంచి వైదొలిగారు. సమస్యలు పరిష్కారం కోసం దశల వారీగా నిరసనలు తెలియజేస్తున్న ఉద్యోగులు మంగళవారం ఈ నిర్ణయం తీసుకున్నారు. మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌కు పట్టణ సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు, రూరల్ మండల గ్రామాల సచివాలయ ఉద్యోగులు ఎంపీడీవో అత్తోట దీప్తికి వినతి పత్రం ఇచ్చారు.

వృద్ధాశ్రమానికి నిత్యావసరాల వితరణ

తెనాలి అర్బన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నాజరుపేటలోని మన ఇల్లు వృద్ధాశ్రమానికి నిత్యావసరాలు అందజేశారు. శ్రీవిఖనస శ్రీనివాస ట్రస్ట్ ప్రథమ వార్షికోత్సవంను పురస్కరించుకుని మంగళవారం ఆశ్రమ వాసులకు సరుకులందించారు. ట్రస్ట్ సభ్యుడు కిరణ్‌కుమార్, వెంకటేశ్వరరావు, బాలకృష్ణ, చంద్రశేఖర్, రామారావు, సోమశేఖర్ పాల్గొన్నారు.

పాస్టర్లకు బ్యాగులు పంపిణీ

తెనాలి అర్బన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఐతానగర్‌లోని ఆర్ఈఐ మినిస్ట్రీస్‌లో పాస్టర్లకు బ్యాగులను పంపిణీ చేశారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.